
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 13.05.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 50 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# విద్య పేరుతో దోపిడి

## ఏడాదికి 5వేల కోట్ల రాబడి

- తల్లిదండ్రుల బలహీనతలని తమ బలంగా మార్చుకుంటున్న విద్యా సంస్థలు
- 'చైనా' ఏజెంట్లుగా మారిన మంత్రులు
- అక్రమాలపై పోరాటానికి సిద్ధమైన **నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి**



**నవ్యాంధ్రలో భయంకరమైన విద్యా దోపిడి జరుగుతోంది. కళ్ళ ముందే వేలకోట్లు నాయకుల జేబుల్లోకి వెళ్ళిపోతున్నాయి. ఎన్నికల్లో ఒక పార్టీని గెలిపించే స్థాయిలో డబ్బు కుమ్మరించి పార్టీ అధికారంలోకి రాగానే మంత్రి పదవులు అలంకరించే దశకి విద్యా సంస్థల అధినేతలు ఎదుగుతున్నారంటే ఇక విద్యను అడ్డం పెట్టుకుని వీళ్ళు చేసే దోపిడీ ఎంత భారీగా వుంటుందో మనం వేరే వూహించుకోవలసిన అవసరం లేదు.**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అతి ప్రధానమైన వ్యవస్థగా విద్యా రంగం ప్రాధాన్యతను సంతరించుకుంది. భవిష్యత్ తరాల ఆశలను, ఆశయాలను ఆసరాగా చేసుకుని విద్యా సంస్థల పేరుతో కొన్ని వేల కోట్ల రూపాయలు తమ ఖాతాలో జమ చేసుకుంటున్నాయి నవ్యాంధ్రలోని రెండు సంస్థలు. రాష్ట్రంలో మరే విద్యాసంస్థ తమకు ఎదురు నిలిచి మనుగడ సాధించరాదన్న ధీమాతో అదే లక్ష్యంగా "చైనా" అన్న పేరుతో శ్రీచైతన్య నారాయణ విద్యాసంస్థలు పని చేస్తున్నాయి. వీరికి అండగా సాక్షాత్తూ ముఖ్యమంత్రితో పాటు ఆయన మంత్రివర్గంలోని ముఖ్యులు కూడా వున్నారంటే సామాన్య ప్రజలను ఎంత దారుణంగా వీరు దోచుకుంటున్నారో వేరే చెప్పనవసరం లేదు.

ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వీరికి చెంపపెట్టుగా మారినా, ఆ తీర్పును సైతం ప్రధానమంత్రి పలుకుబడితో మార్పించాలనుకుంటున్న వీరి అవినీతి ప్రస్థానం ఎంతటి పతాక స్థాయికి చేరిందో వూహించుకుంటేనే ఆశ్చర్యమేస్తోంది. వైద్య విద్య కోసం అడ్మిషన్లను కేవలం "నీట్" ద్వారానే చేసుకోవాలన్నది సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పు. రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాలోనూ తమ పెత్తనాలను సాగిస్తున్న మెడికల్ కళాశాలలకు కోచింగ్ సెంటర్లకు కళ్లెం వేయాలన్నదే సుప్రీంకోర్టు లక్ష్యం. నవ్యాంధ్రలో కేవలం ఈ రెండు విద్యా సంస్థలు కొన్ని లక్షల మంది విద్యార్థులను తమ సంస్థలలో చేర్పించుకుని వారి వద్ద కోట్ల రూపాయలు ఫీజుల రూపంలో దండుకుంటూ ప్రభుత్వాన్ని, ప్రభుత్వంలోని పెద్దలని తమ ఆర్థిక, రాజకీయ పలుకుబడితో ఎంతగానో వాడుకుంటున్నారనడానికి నిదర్శనమే మొన్నటి ఎంసెట్ రిజల్ట్స్.

టాప్10లో పదికి పదీ 'చైనా'(చైతన్య నారాయణ) బ్యాచ్‌కి రావడంతో పాటు మొదటి వందలో 85ర్యాంకులు వారికే వచ్చాయంటే ఈ ఫలితాలకు వాటిని విడుదల చేసిన మంత్రులకు అసలు విశ్వసనీయత వుందా...? అని ప్రజలు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చైతన్య – నారాయణలు కలిసి ఏర్పాటు చేసుకున్న "వర్సిటి ఎడ్యుకేషనల్ సొసైటి"లో సమన్వయ కమిటి

(మిగతా 11వ పేజీలో)






- మొదలైన యుద్ధం

# విడిపోవడానికి సిద్ధం

- ఊహించిందే జరుగుతోంది

ప్రత్యేక హోదా అంశం రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీల మధ్య విభేదాలకు బాటలు వేసింది. ప్రత్యేకహోదా ఇవ్వనందుకు తెలుగుదేశం నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తుండగా, రాష్ట్రంలోని బీజేపీ నాయకులు తెలుగుదేశంపై ఎదురుదాడికి దిగారు. హోదా అపరసంజీవని కాదని చెప్పింది చంద్రబాబేనని, మళ్ళీ హోదాపై ఎలా విమర్శలు చేస్తారంటూ నిలదీస్తున్నారు.

అయితే ప్రత్యేకహోదా విషయంలో ఎవరి లెక్కలు వారికున్నాయి. చంద్రబాబు తొలి నుండి కూడా ప్రత్యేకహోదా కంటే ప్రత్యేకప్యాకేజీ వైపే మొగ్గుచూపుతున్నాడు. హోదా వస్తే రాజకీయంతో సంబంధం లేకుండా రాష్ట్రం బాగుపడుతుంది. దానివల్ల ఆయనకేం లాభం. అదే ప్యాకేజీ క్రింద నిధులొస్తే

(వివరాలు 11వ పేజీలో)

## ప్రతాప్...

## ఉంటాడా? వెళ్తాడా??



11లో

## జన్మభూమికి జై అంటున్న

# దుబాయ్ నెల్లూరీయులు

- సింహపురియన్స్ ఆఫ్ యుఏఇ తొలి సమావేశం
- అధిక సంఖ్యలో పాల్గొన్న నెల్లూరీయులు
- తొలి అతిథిగా "లాయర్"
- జిల్లా అభివృద్ధికి కదలిరమ్మంటూ పిలుపునిచ్చిన శివప్రభాత్‌రెడ్డి




జన్మభూమిని కన్న తల్లిని మేమెప్పటికీ మరువం అని యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్(యుఏఇ)లో వుంటున్న నెల్లూరీయులంతా ముక్తకంఠంతో అంటున్నారు. సింహపురీయన్స్ ఆఫ్ యుఏఇ అంటూ దుబాయ్, అబుదాబి, షార్జాలతో పాటు ఇతర నాలుగు ఎమరేట్స్‌ని కలిపి మొత్తం ఏడు ఎమరేట్స్‌లో నివసిస్తున్న నెల్లూరీయులంతా ఒక్కొక్కరిగా ఒక వేదికపైకి చేరుతున్నారు.

గంగపట్నం విజయభాస్కర్‌రెడ్డి, గాజుల కిరణ్ కుమార్‌రెడ్డి, వూడి విజయకుమార్, దువ్వూరు కిషోర్‌బాబుల సంకల్పంతో వారి సారథ్యంలో ఏర్పడిన యుఏఇ సింహపురీయన్స్ సంస్థ క్రమంగా తన పరిధిని విస్తరించుకుంటోంది.

మే 6వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు దుబాయ్ లోని ఇండియా క్లబ్‌లో సంస్థ తొలి సమావేశం కన్నుల పండువగా జరిగింది. దాదాపు 60 కుటుంబాల నెల్లూరీయులు పిల్లా పెద్దలతో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ జన్మభూమి అయిన జిల్లా పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

నెల్లూరీయులు జరుపుకుంటున్న తొలి ఆత్మీయ సమావేశానికి ప్రత్యేక అతిథిగా 'లాయర్'ని ఆహ్వానించారు. 'లాయర్' సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్ రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నాడు. ముందుగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలతో పాటు మరికొన్ని సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

సంస్థ నిర్వాహకులలో ఒకడైన ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దువ్వూరు కిషోర్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వుంటూ ఇంజనీరింగ్ చదువుకుని ఉద్యోగం కోసం ప్రయత్నించే అనేక మంది త్రిబుల్ ఇ చదివిన యువతరాన్ని తమ సంస్థ జజీరా ఎమిరేట్స్ పవర్ ద్వారా దుబాయ్‌కి తీసుకొచ్చామని చెప్పాడు. ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం కలిగిన వారికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి దుబాయ్‌లో వున్న అవకాశాలను వారికి తెలియజేసి వారిని దుబాయ్‌కి రప్పిస్తున్నట్లు చెప్పాడు. ప్రతిభా సామర్థ్యం కలిగిన నేటి తరం యువతకి తమ సంస్థ ఎల్లవేళలా అవకాశాలను కల్పిస్తుందని స్వాగతించాడు.

నాటి దుబాయ్ నేటి దుబాయ్ రేపటి దుబాయ్ అంటూ దుబాయ్ ఏర్పడ్డప్పటి నుండి జరిగిన జరుగుతున్న జరగబోతున్న అభివృద్ధిని గురించి దుబాయ్‌లో నివసిస్తున్న నెల్లూరు ఆడిటర్ సుంకు సాయిప్రకాష్ వివరించాడు. దుబాయ్‌లో ఉద్యోగస్తులకు లేదా వ్యాపారవేత్తలకు అద్భుతమైన అవకాశాలు వున్నాయని నెల్లూరీయులు దుబాయ్‌పై దృష్టి పెట్టి వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరాడు.

శివప్రభాత్‌రెడ్డితో పాటు కార్యక్రమానికి భారత దేశం నుండి వచ్చి హాజరైన టివి మరియు సినిమా డైరెక్టర్ అళహరి తన ప్రసంగంతో సభలో కొంతసేపు నవ్వుల వాన కురిపించాడు. నెల్లూరీయులు జరుపుకుంటున్న ఈ ఆనంద వేడుకలో తనను కూడా భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపాడు.

గాజుల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, శ్రీసిటి కారణంగా పారిశ్రామిక ముఖద్వారంగా నెల్లూరుజిల్లా అగ్రభాగాన నిలువబోతోందని, భారత దేశంలో, ముఖ్యంగా నెల్లూరు పరిసర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టదలచిన వారికి ఇది మంచి అవకాశమని, శ్రీసిటి పరిసర ప్రాంతాల్లో పినాకిని ఇన్‌ఫ్రా వంటి సంస్థలు విశేష ఆదరణను అందుకుంటూ భవిష్యత్ ప్రగతికి వారధులుగా నిలుస్తున్నాయని అన్నారు.






మీ బడిని మీ గుడిని అమ్మ ఒడిని ఎప్పటికీ మరువద్దని, ఏ దేశమేగినా ఎందు కాలిడినా మరువద్దు మీ జన్మ భూమిని అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన శివప్రభాత్‌రెడ్డి నెల్లూరు అభివృద్ధికి నెల్లూరీయులంతా ఒక్కటిగా కలిసి చేయి చేయి కలిపి కదలిరావలసిందిగా పిలుపునిచ్చాడు. నెల్లూరుజిల్లాకి వ్యవసాయ పరంగా, సాహితీపరంగా, కళల పరంగా వున్న ప్రాముఖ్యతని నెల్లూరీయులకున్న ఖ్యాతిని ఆయన వివరించాడు.









సంచలనాలను సృష్టించడంలోనూ దానధర్మాలలోనూ, వ్యాపార పారిశ్రామిక రంగాలతో పాటు రాజకీయ రంగంలోనూ నెల్లూరీయులు చూపిస్తున్న ప్రతిభ, వారు కనపరుస్తున్న శక్తి సామర్థ్యాల గురించి దుబాయ్ నెల్లూరీయులకు తెలియజేశాడు. నెల్లూరీయులు ఎక్కడున్నా తమ ప్రత్యేకతను చాటుకుంటారని చెప్తూ మొలగొలుకులు మొలచిన జిల్లా, మొనగాళ్ళకు నెలవైన ఖిల్లా నెల్లూరుజిల్లా అంటూ నెల్లూరు కీర్తిని గురించి చెప్పాడు. మలైఖాజాకి, మందలేంటి అన్న నెల్లూరు యాసకీ వున్న ప్రాధాన్యతని గుర్తు చేశాడు. ప్రభుత్వాలపై ఆశలు పెట్టుకోకుండా మన ఊరిని మనమే బాగు చేసుకుందాం అన్న సిద్ధాంతంతో గ్రామాలను దత్తత తీసుకుని తమ పేరు చిరస్మరణీయం చేసుకోవాలని సూచించాడు. మనిషి శాశ్వతం కాదని, డబ్బు అంతకంటే శాశ్వతం కాదని, చేసిన గొప్ప పని మాత్రం ఎప్పటికీ శాశ్వతంగా వుండిపోతుందని, ఈ చరిత్ర వున్నంత వరకు ఆ పని చేసిన వారి ఘనత చిరస్థాయిగా వుండిపోతుందని ప్రతి ఒక్కరూ ఈ జీవిత సత్యాన్ని గుర్తించి సేవా సామ్రాజ్యంలో తమ వెలుగులు ప్రకాశింపజేయాలని కోరారు. శివప్రభాత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు నెల్లూరీయుల నుండి మంచి స్పందన లభించడం గమనార్హం. తాము కూడా తాము చదువుకున్న బడికో, మొక్కుకున్న గుడికో తమకు చేతనైన సాయం అందిస్తామని అప్పటికప్పుడే కొంతమంది ప్రకటించడం హర్షణీయం.



యుఏఇ నెల్లూరీయులంతా ఒక వేదికపైకి చేరడానికి ఆవిర్భవించిన 'యుఏఇ సింహపురీయన్స్' నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఏర్పాటు చేసుకున్నారు. యుఏఇలో వున్నవి 7 ఎమిరేట్సే కాబట్టి తొలుతగా 7మందితో కొత్త కార్యవర్గాన్ని నియమించుకున్నారు. గంగపట్నం ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వూడి విజయకుమార్, గాజుల కిరణ్‌కుమార్‌రెడ్డి, చిన్ని యశోవర్ధన్, ఎరికి తులసిప్రసాద్, కొండా వెంకటసింధు, చిలకపాటి వెంకట లక్ష్మీ సింధూరలను నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఈ ఆత్మీయ సంబరంలో అధిక సంఖ్యలో మహిళలూ పిల్లలూ పాల్గొని కార్యక్రమం ఆద్యంతం నెల్లూరుపై తమకున్న ప్రేమానురాగాలను చూపించారు. ఈ సందర్భంగా భారతదేశం నుండి వచ్చిన శివప్రభాత్‌రెడ్డిని, అళహరిని సింహపురీయన్స్ పక్షాన సత్కరించి చిరుజ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో దువ్వూరు కిషోర్‌బాబుతో పాటు శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, సాయిప్రకాష్, శరత్‌చంద్ర, మురళిరెడ్డి, డా॥ సాగరేశ్వర్, ఫాజల్, భానుప్రకాష్‌రెడ్డి, సందీప్, సందేశ్ మల్లిఖార్జునరెడ్డిలతో పాటు గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆటపాటల సందడితో అలరించిన చిన్నారులతో పాటు వచ్చిన అతిథులందరికీ చిరు జ్ఞాపికలను ఇచ్చి గౌరవించారు నిర్వాహకులు.

ఉన్న ఊరికి, కన్నవారికీ దూరంగా జీవన పోరాటానికి తీరాలు దాటి వెళ్ళి నిరంతరం శ్రమించే వారికి ఇలాంటి ఆత్మీయ సదస్సులు ఆప్తుల పలకరింపులు కొత్త ఉత్సాహాన్నిస్తాయి. మన ఊరు, మనవాళ్ళు, మన గాలి అన్న సిద్ధాంతంతో వీరంతా అప్పుడప్పుడు కలుస్తుంటే ఒకరికి ఒకరం అండగా మేమున్నాం అన్న భరోసాతో అందరూ తమ జీవితాలని ప్రగతి ప్రస్థానం వైపు నడిపించు కోవచ్చు... ఆల్‌ది బెస్ట్ టూ యుఏఇ నెల్లూరీయన్స్.






50 వసంతాల వివాహ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్న బుచ్చి మండలం, మినగల్లుకు చెందిన పెంచల్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి, అళహరి, కిషోర్‌బాబు, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, కిరణ్











# హోదాపైనే రాష్ట్ర భవిష్యత్తు!



నెల్లూరు నగరంలో వైకాపా ఆధ్వర్యంలో జరిగిన భారీ ప్రదర్శన

ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోసం వైయస్సార్సీపీ అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జిల్లా నలు మూలల నుంచి వైయస్సార్‌సిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. వీరంతా నెల్లూరు విఆర్‌సి సెంటర్ నుంచి పాత జడ్పీ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైయస్సార్సీపీ నాయకులు ఆనం విజయ కుమార్‌రెడ్డి, బాలచెన్నయ్య, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సిజిసి సభ్యుడు నేదురుమల్లి పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా యువత అధ్యక్షుడు రూప్ కుమార్‌యాదవ్, నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి విష్ణు వర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ఎస్ఆర్‌కె ప్రతిభ



ఈ ఏడాది పదవ తరగతి ఫలితాలలో నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని ఎస్ఆర్‌కె విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతను సాధించారు. ఒకరు 10పాయింట్లను, 16మంది 9.8 పాయింట్లను, 12మంది 9.7 పాయింట్లను, 13మంది 9.5 పాయింట్లను, 77మంది 9కి పైగా పాయింట్లను సాధించారు. గణితంలో 97మంది విద్యార్థులు 10 పాయింట్లను సాధించడం విశేషం. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక సిబ్బందిని స్కూలు కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి, డైరెక్టర్ దిలీప్‌లు అభినందించారు.

# నేతాజీ హవా!

2016 టెన్త్ ఫలితాలలో నూరుశాతం ఉత్తీర్ణతను శ్రీ నేతాజీ పైలట్ హైస్కూల్ విద్యార్థులు సాధించారు. సిహెచ్ శ్రీలేఖ, ఎ.సాయితేజశ్రీ, కె.హరిత, పి.చాందిని, డి.పవన్, ఎ.బి.ప్రవల్లిక 9.8 పాయింట్లు అలాగే జి.సాయిసాత్విక్ యాదవ్, వి.వైభవ్, వి.హైందవి, షేక్ అల్తాఫ్ హుస్సేన్, జి.విష్ణుమణివర్ధన్, బి.సాయి కృష్ణ 9.7 పాయింట్లు సాధించారని, 36మంది ఎ1, 8మంది ఎ2, 50మంది బి1, 25మంది బి2, 16మంది సి1 గ్రేడ్లు సాధించినట్లు స్కూలు కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు.



# సివిల్స్‌తో సత్తాచాటిన నెల్లూరోడు!

ఈ నెల 10వ తేదీన విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో నెల్లూరు మాగుంట లే అవుట్‌కు చెందిన పోతురాజు సాయి చైతన్య తన సత్తా చాటాడు. రెండో ప్రయత్నంలోనే 158వ ర్యాంకును సాధించాడు. ట్రాన్స్‌కోలో డి.ఇగా పని చేస్తున్న శ్రీనివాస అనిల్‌కుమార్ కొడుకే సాయిచైతన్య. నెల్లూరులో అనిల్ తెలియని వాళ్లుండరు. ఇప్పుడు తన కొడుకు వల్ల ఆయన పేరు మార్మోగుతోంది. సాయి చైతన్య 2014లోనే సివిల్స్ వ్రాసారు. అయితే అప్పుడు ఎంపిక కాలేదు. తిరిగి 2015 ఆగష్టు 24న సివిల్స్‌కు సంబంధించి ప్రిలిమ్స్, డిసెంబర్ 17న మెయిన్స్ పరీక్షలు వ్రాసారు. ఈ ఏడాది మార్చి 31న ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరై 158వ ర్యాంకు సాధించారు. ఈ ర్యాంకుతో సాయి చైతన్యకు ఐఆర్ఎస్ వంటి హోదా వస్తుంది. ఈ ఏడాది కూడా సివిల్స్ రాసి ఇంకా మెరుగైన ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపిక కావాలనేది సాయిచైతన్య లక్ష్యం. సాయి చైతన్యకు, కొడుకును ఈ స్థాయికి తీసుకెళ్లిన తండ్రి అనిల్‌కు 'లాయర్' అభినందనలు.

# అలరించిన ఫోటో ఆల్బమ్ ఎగ్జిబిషన్

నెల్లూరు విఆర్‌సి సెంటర్ వద్దనున్న హోటల్ అనురాగ్‌లో ఈ నెల 8వ తేదీ చెన్నై 'దిన కలర్ ల్యాబ్' ఆధ్వర్యంలో 'ఫోటో ఆల్బమ్ ఎగ్జిబిషన్ మరియు ఎంబోజింగ్ ప్రింట్స్' విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిన గ్రూప్ మేనేజర్ జయవేలు పాల్గొని విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.






శ్రీ కలికి వెంకురెడ్డి గారు

జననం: 05-02-1916 మరణం: 29-04-2015

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి!!

ప్రథమ వర్ధంతి

మంచితనం, మానవత్వం, ఆధ్యాత్మిక విలువలు కలగలసిన మీ వ్యక్తిత్వం మహోన్నతం.
ఉదాత్తమైన ఉన్నత విలువలతో సాగిన మీ జీవనయానం మాకు ఆదర్శం.
మీరు చూపిన బాట సదా అనుసరణీయం. ఆ బాటలోనే నడుస్తాం.

కలికి వెంకురెడ్డి గారి
ప్రథమ వర్ధంతి సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

భార్య : కలికి వజ్రమ్మ

కుమారులు - కోడళ్లు
కలికి కోదండరామిరెడ్డి - శ్రీలత
వ్యవస్థాపక ధర్మకర్తలు,
శ్రీసాయిబాబా మందిరం ట్రస్ట్, కొత్తూరు.
కలికి రాజారామిరెడ్డి - శైలజ

మనుమరాళ్లు - మనుమలు
డాక్టర్ స్వాతి - డాక్టర్ చదివే జగదీష్
తరంగిణి - కలిచేటి రామచరితమానస్
దీప్తిరెడ్డి - బెజవాడ సాయిరత్నాకర్
కలికి సునీల్‌కుమార్‌రెడ్డి - సౌమ్య
నీలిమ - సొల్లేటి వంశీకృష్ణ (USA)

మునిమనుమలు, మనుమరాళ్లు
నిర్మణ్య
మేధాన్స్
కిమయాంజని
మేఘన భావని

ప్రథమ సంస్మరణ: తిథుల ప్రకారం తేది. 17-05-2016 మంగళవారం, ఇందుకూరుపేట మండలం, కొత్తూరులోని వారి స్వగృహమునందు జరుగును.

## 'ప్రభా'తం

# వైద్యవిద్యకు వెలుగుబాట

వైద్యవిద్యా కోర్సుల్లో జాతీయ అర్హత ప్రవేశ పరీక్షకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పు ఎంతో హర్షించదగ్గది. ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులంతా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను రాయడం తప్పనిసరి చేయడం విద్యార్థిలోకానికి ఒక మేలుబాట అనే చెప్పవచ్చు. 'నీట్' నిర్వహణకు క్రమబద్ధమైన విధానాలు కూడా నిర్ధేశించడంతో అన్నివిధాలా విద్యార్థుల భవితకు వెలుగుబాట పరిచినట్లేనని చెప్పవచ్చు.

వైద్య విద్య ప్రవేశ పరీక్షల్లో ఇటీవలికాలంలో నెలకొన్న గందరగోళానికి ఎట్టకేలకు తెరదించుతూ, వైద్యవిద్యా కోర్సుల్లో జాతీయ అర్హత ప్రవేశ పరీక్షకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పు ఎంతో హర్షించదగ్గది.. అందరూ స్వాగతించదగినది. ఇప్పటిదాకా లక్షలాదిమంది విద్యార్థుల్లో నెలకొన్న ఉత్కంఠ పరిస్థితి నుంచి ఈ తాజా తీర్పు ఎంతో ఉపశమనం కలిగించిందనే అనుకోవచ్చు. ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులంతా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను రాయడం తప్పనిసరి అని సుప్రీం కోర్టు తేల్చిచెప్పడం విద్యార్థిలోకానికి ఒక మేలుబాట అనే చెప్పవచ్చు.

తాము ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించుకునేందుకు అనుమతివ్వాలంటూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, జమ్మూకాశ్మీర్ తదితర రాష్ట్రాలు, మైనార్టీ విద్యాసంస్థలు చేసిన విజ్ఞప్తులను తిరస్కరించింది. వైద్యవిద్యా కోర్సులకు దేశవ్యాప్తంగా ఒకేవిధమైన ప్రవేశపరీక్ష వుండాలన్న నిర్ణయం ఎంతైనా సముచితమని నిర్ణయించింది. రాష్ట్రాలకు విడిగా పరీక్ష నిర్వహించే అధికారం లేదని పేర్కొంది. ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ ఒక్కటే మార్గమని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల బోధన, పాఠ్యాంశాల కూర్పు ఒకేవిధంగా వున్నప్పుడు ప్రవేశపరీక్షల్లోనూ ఏకరూపత పాటించడమే సరైన పద్ధతి అని అభిప్రాయపడి, ఆ మేరకు తుది తీర్పు వెలువరించింది. అద్భుతమైన ఈ తీర్పు సర్వత్రా ప్రశంసలందుకుంటోంది.

వైద్యవృత్తిలో ప్రవేశించడానికి ఎంతగానో శ్రమించే విద్యార్థులు ఏటా దేశంలో నిర్వహించే అనేక రకాల పరీక్షలకు హాజరుకావాల్సి వున్న నేపథ్యంలో, ఇక అలాంటివాటికి ఆస్కారం లేకుండా 'నీట్' ప్రతిపాదన గతంలో వచ్చినప్పటికీ, యుపిఏ పాలనలో ప్రభుత్వం దానిని అంగీకరించినా, రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు అప్పట్లో అది మళ్ళీ ఆచరణలోకి రాక వెనకపడింది. ఎట్టకేలకు సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు విద్యారంగంలో ప్రక్షాళనకు మేలుబాటలు వేసింది. ఇప్పుడు ఇక 'నీట్' అనివార్యం కావడంతో మరింతమంది ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్యవిద్యలో ప్రవేశించేందుకు అనువైన మంచి మార్గం వేసినట్లయిందని కూడా భావిస్తున్నారు. ప్రతిభకే పట్టం కడుతూ, అదే సందర్భంలో రకరకాల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం విద్యాలోకంలో కొత్తవెలుగులు ప్రసరింపజేస్తోందని ఆశించవచ్చు. దేశవ్యాప్తంగా క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత, అన్ని విషయాలనూ కూలంకుశంగా పరిశీలించి 'నీట్' నిబంధనలను రూపొందించడం వల్ల, ఇకనుంచీ ఈ సీట్ల విషయంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరిగే అక్రమాలకు కూడా అడ్డుకట్ట పడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక అన్ని వైద్య విద్య సీట్లనూ 'నీట్' ర్యాంకుల ద్వారానే భర్తీ చేయాలి కనుక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ ఏడాదికి అదనంగా మరికొన్ని ఎంబిబిఎస్ సీట్లు ర్యాంకుల పరిధిలోకి వస్తాయని కూడా భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు విద్యా కళాశాలల్లో సీట్లు పొందడానికి తెలుగు విద్యార్థులు కృషి చేసేందుకు సైతం మార్గం ఏర్పడినట్లు భావిస్తున్నారు. ఇంటర్‌మీడియట్ మార్కుల ప్రాధాన్యం లేకుండా నీట్‌లో వచ్చే మార్కులతోనే వైద్య విద్యలో ప్రవేశాలు జరగబోవడం విద్యార్థులకు ఎంతో మేలైన అంశంగా భావిస్తున్నారు. అటు ఎంసెట్, మెడ్‌సెట్‌లతో ఎలాంటి సంబంధం లేకుండా కొన్ని కళాశాలలు సొంతంగానే సీట్లు భర్తీ చేసేసుకునేవని, అందువల్ల ఈ వ్యవహారంలో కోట్లాదిరూపాయల అక్రమాలకు కూడా ఆస్కారం వుండేదనే ఆరోపణలూ గతంలో వుండేవి. పేద విద్యార్థి ఒకవేళ ప్రతిభావంతుడైనప్పటికీ, ఆ సీటును పొందలేని స్థితి వుండేది. ఇప్పుడు సుప్రీం తీర్పుతో అలాంటి అక్రమాలన్నిటికీ అడ్డుకట్ట పడినట్లేనని ఘంటాపథంగా చెప్పవచ్చు. నీట్ ర్యాంకులతో, ప్రతిభే ప్రాతిపదికగా సీట్లు పొందే అవకాశం రావడం ప్రతిభగల విద్యార్థులకు ఎంత సంతోషమో చెప్పలేం. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోయినా, వైద్యవిద్యపై ఎంతో ఆసక్తితో నిరంతరం కష్టించి చదువుకునే ప్రతిభగల విద్యార్థులకు నీట్ ఒక వరం లాంటిదన్నా అతిశయోక్తి కాదు.

సొంత రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఏ ప్రైవేట్ వైద్య కళాశాలలోనైనా నీట్ ద్వారా సీటు పొందే వెసులుబాటు కలగడాన్ని విద్యార్థిలోకం హర్షిస్తోంది. దేశ వ్యాప్తంగా సుమారు 188 దాకా ప్రైవేటు వైద్య కళాశాలలు వుండగా, వాటిలో 38,715 ఎంబిబిఎస్ సీట్లున్నాయని అంచనా. అయితే, కొన్ని రాష్ట్రాల్లో కొన్ని కళాశాలలవారే నిర్వహించే పరీక్ష ద్వారా తమవారికి మాత్రమే ఉత్తమ ర్యాంకులు వచ్చేలా చేస్తుంటారని, తద్వారా ప్రతిభగలిగిన విద్యార్థులకు అవకాశాలు మృగ్యమైపోతున్నాయనే విమర్శలూ గతంలో వుండేవి. వీటన్నిటి వెనుక ధనార్జనే ధ్యేయంగా అక్రమాలు జరిగేవనే ఆరోపణలు కూడా వుండేవి. ప్రస్తుతం వాటన్నిటినీ నివారిస్తూ, నీట్ పరీక్షల నిర్వహణకు ఒక క్రమబద్ధమైన విధానాన్ని నిర్ధేశించి పటిష్టంగా అమలు చేయనుండడంతో, ఎవరైతే ప్రతిభతో పరీక్షల్లో నెగ్గుకొస్తారో వారికే సీటు వచ్చేలా పకడ్బందీ విధానాలను ప్రవేశపెడుతుండడం విద్యార్థులందరికీ ఎనలేని సంతోషాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా, ఆర్థిక స్తోమతు లేనప్పటికీ కష్టపడి చదువుకునే సామాన్య విద్యార్థులకు ఈ సరికొత్త విధానాలు మంచి మేలు కలిగిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కనీస అర్హత సాధించలేనివారికి ఎలాంటి పరిస్థితుల్లోనూ సీటు కేటాయించడానికి వీలులేని పరిస్థితి ఈ కొత్త విధానంలో వుంటుంది. దీంతో, నీట్ ఒక్కటే అన్ని విధాలా నీటైన మార్గమని అందరికీ అర్థమవుతోంది. ఇలా అన్నిందాలా విద్యార్థులకు ప్రయోజనకరంగా, అక్రమాలకు ఎలాం టి తావు లేకుండా, వైద్యవిద్య భవితకు మంచి దారులు వేసే మార్గదర్శకమైన విధానాలతో 'నీట్' ముందుకు రావడం, అందుకు సర్వోన్నత న్యాయస్థానం సరికొత్త వెలుగుబాటలు పరవడం ఎంతైనా హర్షదాయకం.. సర్వత్రా శుభదాయకం కూడా!...

# వేడుకగా శ్రీ భగవద్రామానుజుల అవతారోత్సవం



నెల్లూరు రంగనాయకులపేటలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ భగద్రామానుజుల వారి 999వ అవతారోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఎంతో భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో భగవద్రామనుజుల స్వామివారిని శేషవాహనంపై ఊరేగించి పేట ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళాశాసనోత్సవం, పేట ఉత్సవంతో, దివ్య ప్రబంధ పారాయణం, శాత్తుమొరై తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో, ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యుల పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు గంటా రమణయ్య-ప్రమీలమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.


# హిందూధర్మ పరిరక్షణకు విస్తృత ప్రచారం

హిందూధర్మ పరిరక్షణకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, హైందవ ధర్మ ఔన్నత్యాన్ని గ్రామగ్రామాన చాటేందుకు కృషి చేస్తామని హిందూధర్మ సంరక్షణ ట్రస్టు సమన్వయకర్త కోట సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని గుడిగంట్ల బాలపీరయ్య కళ్యాణ మండపంలో దక్షిణ కోస్తా, రాయలసీమ పరిధిలోని ఆరు జిల్లాలకు చెందిన మండల హిందూధర్మ ప్రచారక్ శిక్షణా శిబిరం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి హిందువు కుటుంబం కష్టసుఖాలలో భాగస్వాములవుతూ వారిని ఆప్యాయంగా చేయూతనందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పరమత సహనంతో హిందూధర్మ జీవన విలువలు, హైందవ సాహిత్యాన్ని గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయికి తీసుకువెళ్తామన్నారు. ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి త్రినాథ్ మాట్లాడుతూ హిందూధర్మం, సంస్కృతి, జీవన విలువల ప్రచారం, దేవాలయాల కేంద్రంగా సాగాలన్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు చెందిన వందమంది ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు శ్యాంప్రసాద్, జిల్లా హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్
# నూతన కార్యవర్గం

నెల్లూరు నగరంలోని ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కటకం కోటేశ్వరరావు, కార్యదర్శిగా నంబూరి నమ:శివాయ, కోశాధికారిగా జెవికె బాబును ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుండా ఆంజనేయులు కళ్యాణమండపంలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని, రెండేళ్ళపాటు ఈ నూతన కార్యవర్గం బాధ్యతలను చేపడుతుందని వారు పేర్కొన్నారు.

# పల్లెలను బ్రతికించండి




అత్యంత వేగంగా పట్టణీకరణ జరుగుతోంది. పల్లెలు కనుమరుగవుతున్నాయి. పాతతరం వృద్ధులు తప్పితే వారి బిడ్డలు, మనవళ్లు, మనుమరాళ్లు పల్లెటూర్లలో ఉండడం లేదు. ఆ తరాలవారు పోతే పల్లెటూర్లు వల్లకాడులుగా మారడం ఖాయం. ఇటీవల పత్రికలలో చూసాము. మరో ఐదేళ్లలో బెంగుళూరు డెడ్‌సిటీగా మారనుందని. బెంగుళూరులో 1500అడుగుల లోతు బోరువేస్తే కాని నీళ్లు పడవు. ఇప్పటికే కోటికిపైగా జనాభా దాటారు. ఇంతమందికి తాగునీళ్లు, వాడకం నీళ్లు ఎక్కడనుండి తెస్తారు. దేశంలో ఇలాంటి నగరాలెన్నో తయారు కాబోతున్నాయి. ఇప్పటికైనా పట్టణీకరణను తగ్గించేందుకు గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. గ్రామాల నుండి వలసలను ఆపితే అన్ని ప్రాంతాల్లో వాళ్లు సుఖంగా వుంటారు.

**– సాకేత్, బెంగుళూరు.**

# అస్తవ్యస్థ విధానాలు

రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలన గాడి తప్పింది. ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి రాజ్యమేలుతోంది. ఇక్కడ ఒక్కో పనికి ఒక్కో రేటు వుంటోంది. చంద్రబాబు వచ్చాక ఆ రేట్లు పెంచేశారు. మంత్రుల స్థాయిలోనే లంచాలు మేయడం ఎక్కువైంది. నిప్పును అని చెప్పుకునే చంద్రబాబు పరిపాలన అవినీతి తుప్పుగా మారింది.

**కోదాడ సుబ్రహ్మణ్యంరెడ్డి, చీరాల.**

# సిమెంట్‌రోడ్లు ఆపండి!

రాజకీయ నాయకులు ఆర్థిక ప్రయోజనాల కోసం సిమెంట్‌రోడ్లను విచ్చలవిడిగా చేస్తున్నారు. ఈ రోడ్ల వల్ల పర్యావరణానికి చేటు. కాలుష్యం పెరుగుతుంది. సరికదా వర్షాకాలంలో నీళ్లు భూమిలోకి ఇంకిపోయే పరిస్థితి వుండదు. తారురోడ్లు ఎంతో మంచివి. సిమెంట్ రోడ్లను నిలిపివేయాలి.

**బి.కాంచన, నెల్లూరు.**

• ఈ ఏడాదికి

# నెల్లూరోళ్లు అదృష్టవంతులే!

2016 సంవత్సరానికి సంబంధించినంతవరకు నెల్లూరోళ్లు అదృష్టవంతులే అనుకోవాలి. ప్రతిరోజూ పేపర్లలో, టీవీలలో వస్తున్న వార్తలను చూస్తుంటే నిజంగా మన పరిస్థితి ఎంతో మెరుగ్గా వుందని సంబరపడాలి. దేశంలో ఎక్కడచూసినా కరువు రక్కసి విలయతాండవం చేస్తోంది. మహారాష్ట్రలో అయితే క్రికెట్ స్టేడియాలను తడపటానికి నీళ్లు లేక ఐపిఎల్ మ్యాచ్‌లను అక్కడ నుండి మార్చడం చూశాం. ఇక మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో కొన్ని కరువు జిల్లాలకైతే కేంద్రం రైల్‌ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లను పంపిస్తోంది. బయట రాష్ట్రాల దాకా ఎందుకు... మన రాష్ట్రంలో పరిస్థితే చూద్దాం. గత కొన్ని దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంతగా గోదావరి డెల్టా ఎండిపోయింది. ధవళేశ్వరం బ్యారేజీ నీటి మట్టం దారుణంగా పడిపోయింది. కృష్ణా డెల్టా గతంలో ఎప్పుడూ లేనంత దారుణ స్థితిలో వుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి మట్టాలు అడుగంటిపోయాయి. ఈ రెండు డెల్టాలలోనూ తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రెండు డెల్టాల్లోనూ మొదటి పంటకే నీళ్లు లేవు. ఇక ఇక్కడ రెండో పంట వూసే లేదు.

రాష్ట్రంలో ఒక్క నెల్లూరు జిల్లాలో మాత్రమే పరిస్థితులు మెరుగ్గా వున్నాయి. 2015 నవంబర్‌లో వర్షాలు పడకపోయి వుంటే ఇప్పటికి మనం కూడా నీళ్లకు ఘస్తుండేవాళ్లం. పంటలను ఎండబెట్టుకుని వుండేవాళ్లం. మంచినీటి ట్యాంకర్ల వద్ద బిందెల యుద్ధాలు మొదలై వుండేవి. తాగునీటికి తంటాలు పడాల్సి వచ్చేది. బావులు, బోర్లు ఎండిపోయి మంచి నీళ్లకు మైళ్ల దూరం ప్రయాణాలుండేవి. అపార్ట్‌మెంట్లకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొనాల్సివచ్చేది. సోమశిలకు శ్రీశైలం నుండి నీళ్లు వదలండని సీఎంకు మొరపెట్టుకోవాల్సి వచ్చేది.

## దేశమంతా కరువున్నా నెల్లూరులో నీళ్లు!



నవంబర్ వర్షాల పుణ్యమా అని మనకు ఆ బాధలు తప్పాయి. సోమశిల, కండ్లేరులతో పాటు అన్ని చెరువులు నిండడంతో మనకు ఈ సంవత్సరం కరువు బాధ తప్పింది. మిడిమేళంగా కాస్తున్న ఈ ఎండల్లో కూడా మనకు మంచినీళ్లు దొరుకుతున్నాయి. దాదాపు 10లక్షల ఎకరాలలో మొదటి పంటను పండించుకున్నాం. రాష్ట్రంలోనే రెండో పంటకు నీళ్లందిస్తున్న జిల్లాగా మనమే ముందు నిలిచాం. 2016 లక్కీయెస్ట్ జిల్లా నెల్లూరే! ఇందులో సందేహం లేదు.

Vs

# తన్నులాటకు తమ్ముళ్ళు సిద్ధం

రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ నాయకులకు మధ్య చిచ్చు రగిలింది. ఈ చిచ్చును ఆరిపోనీయకుండా చేయడంలో ఎవరి వంతు పాత్రను వాళ్ళు పోషిస్తుండగా, ఇందుకు మేం సైతం ఓ సమిధను అందిస్తామంటూ నెల్లూరుజిల్లా తెలుగుదేశం, బీజేపీ నాయకులు కూడా ముందుకొచ్చారు.

ఇటీవల కావలిలో ఇన్‌ఛార్జ్ మున్సిపల్ ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్‌పై తెలుగుదేశం నాయకులు దాడి చేయడం తెలిసిందే! దీనిపై ధ్వజమెత్తిన బీజేపీ నాయకులు పార్టీ నుండి దాడి చేసిన నాయకులను సస్పెండ్ చేసేలా చేయగలిగారు. అయితే అంతటితో వూరుకోలేదు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాలను విమర్శించారు. అయితే ఆయన ప్రభుత్వంపై అంతగా చెలరేగిపోవడానికి కారణం పైనుండి వచ్చిన సూచనలవల్లేనని తెలుస్తోంది. బీజేపీ అధిష్టానం అనుమతి లేకుండా క్రిందిస్థాయిలో వీళ్లు ఇంత దారుణంగా విమర్శలు చేయడానికి సాహసించలేరు. చంద్రబాబు పచ్చి అవినీతిపరుడని ఆయన విమర్శలు చేయడంతో నిప్పు రాజుకుంది. దీనిపై తెలుగుదేశం నాయకులు స్పందించారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి బృందం ప్రెస్‌మీట్ పెట్టి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి బ్లాక్‌మెయిలర్ అంటూ ఆరోపించింది. అధికారులను, కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు దండుకుంటున్నారంటూ విమర్శలు చేసింది.

మొత్తానికి ఇరు పార్టీల మధ్య నిప్పు పడింది. ఈ నిప్పును ఆర్పుతారో, లేక మంటలు ఇంకా ఎగిసిపడేలా చేస్తారో చూడాలి!

# పెద్దాయనకు అశ్రునివాళి



తండ్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కీర్తిశేషులు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి... ఈయనొక రాజకీయ విశ్వవిద్యాలయం. ఎంతోమంది రాజకీయ నాయకులను తయారు చేసిన కేంద్రం. రాజకీయ వటవృక్షం. ఎంతోమందికి రాజకీయ నీడను కల్పించిన కల్పవృక్షం. నెల్లూరోళ్లంతా పెద్దాయనగా పిలుచుకునే నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని ఇందిరా భవన్‌లో జరిగింది. నేదురుమల్లి నడిపిన రాజకీయాలు వేరు. ఇప్పటి రాజకీయాలు వేరు. ప్రస్తుత రాజకీయాలు కుళ్లు కంపు కొడుతున్నాయి. రాజకీయాలు ఇంత కలుషితంగా మారిన నేటి రోజుల్లో కూడా నేదురుమల్లి వర్ధంతి కార్యక్రమం అనగానే జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు రాజకీయాలను పక్కనపెట్టి ఇందిరా భవన్‌కు విచ్చేసి ఆయన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దాయనకు నివాళులర్పించి ఆయన పట్ల తమకున్న భక్తి, అభిమానం చాటుకున్నారు.

నేదురుమల్లి తనయుడు, బీజేపీ నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారధ్యంలో జరిగిన ఈ సభలో జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు సి.వి.శేషారెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, చేవూరు దేవకుమార్‌రెడ్డి, బి.వేణుగోపాల్‌రెడ్డి, ఏసునాయుడు, టి.బాలసుధాకర్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, పత్తి సీతారాం బాబు, తెలుగుదేశం నాయకులు బెజవాడ ఓబుల్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్, తాటి వెంకటే శ్వర్లు, బొబ్బల శ్రీనివాసయాదవ్, ఇంకా వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్దాయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఇందిరా భవన్‌లో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి నిలువెత్తు చిత్రపటాన్ని ఆవిష్కరించారు.



సభలో ప్రసంగిస్తున్న సోమిరెడ్డి, వేదికపై అన్ని పక్షాల నేతలు

# పదిలో సత్తా చాటిన నెల్లూరు స్కూల్స్

## మెరిసిన రత్నాలు



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న కె.వి.రత్నం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో రత్నం హైస్కూల్స్ అత్యుత్తమ ఫలితాలను సాధించాయి. ఈ విద్యా సంస్థలకు చెందిన 36మంది విద్యార్థులు పది గ్రేడ్ సాధించారు. 118 మంది విద్యార్థులు 9.8 గ్రేడ్‌ను, 214మంది విద్యార్థులు 9.7 గ్రేడ్‌ను, 319మంది విద్యార్థులు 9.5 గ్రేడ్‌ను, 527మంది విద్యార్థులు 9.2 గ్రేడ్‌ను, 619మంది విద్యార్థులు 9.0 గ్రేడ్‌ను సాధించారు. మంగళవారం కలెక్టర్ బంగ్లా సమీపంలోని రత్నం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతిభావంతులైన విద్యార్థులను రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం అభినందించారు. ఉత్తమ శిక్షణ, అత్యుత్తమ క్రమశిక్షణతోనే ఈ ఫలితాలను సాధించగలిగామని కె.వి. రత్నం పేర్కొన్నారు. ఇంతటి విజయాలకు కారకులైన అధ్యాపకులు, సిబ్బందిని కూడా ఆయన అభినందించారు.

## మైథిలి విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ యం.జానకితో మైథిలి విద్యార్థులు మరియు కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి

నెల్లూరు, చంద్రమౌళినగర్‌లోని మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష రాసిన అందరూ పాస్ కావడమే కాకుండా లక్ష్మీ కళ్యాణి, కె.సుయనిక, వరుణ్‌చంద్రలు పది గ్రేడ్ సాధించారు. మరో ఇద్దరు 9.8గ్రేడ్‌ను సాధించడం విశేషం. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ బి.మైథిలి మనోహర్‌రెడ్డి అభినందించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఎం.జానకి కూడా మైథిలి విద్యార్థులను అభినందించారు.

## మాడరన్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా నెల్లూరు, సరస్వతీ నగర్‌లోని మాడరన్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పది గ్రేడ్‌ను ముగ్గురు విద్యార్థులు(టిపిఎల్ వైష్ణవి, యస్.పి.గాయత్రి, పి.హార్థిక్)లు సాధించారు. నలుగురు విద్యార్థులు 9.8 గ్రేడ్‌ను సాధించారు. మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను, ఉపాధ్యాయులను స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి




# నెల్లూరు కబుర్లు

## పదిలో జిల్లాకు పదో స్థానం

ఈ నెల 10వతేదీ విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా పదో స్థానంలో నిలిచింది. జిల్లాలో 34,287మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 31,868మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 92.94శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాలో 250మంది విద్యార్థులు పదికి పది గ్రేడ్ సాధించారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో సైతం మంచి ఫలితాలు వచ్చాయి. జడ్పీ, ఎయిడెడ్, మోడల్, కార్పొరేషన్ స్కూళ్లలో విద్యార్థులు కూడా 9.5గ్రేడ్ నుండి 10 గ్రేడ్ దాకా సాధించడం విశేషం.

### ముస్లిం సోదరులతో

## సరదాగా గడిపిన ఎస్.పి



ముస్లిం చిన్నారులతో క్రికెట్ ఆడుతున్న జిల్లా ఎస్పీ విశాల్ గున్ని

పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి గస్తీలతో పాటు పగటి గస్తీలను ముమ్మరం చేయాలని నెల్లూరుజిల్లా ఎస్పీ ఒకటవ నగర పోలీసులకు సూచించారు. 7వ తేదీ ఒకటవ నగర పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గస్తీలను పెంచడం వల్ల దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. అవసరమైతే ఏఆర్ పోలీసులను వినియోగించుకోవాలని సూచించారు. కొన్ని కేసుల్లో దొంగలను పట్టుకుని రికవరీ చేయడంలో ప్రతిభ కనపరచిన పోలీసు సిబ్బందికి నగదు రివార్డులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర, ఎస్బీ డిఎస్పీలు వెంకటరాముడు, కోటారెడ్డి, సిఐ అబ్దుల్ కరీం, ఎస్సై గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్ళండి:

సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్ళి సామరస్యంగా పరిష్కరించుకోవాలని, పోలీసులు మీకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమాచారాన్నయినా వెంటనే తమకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ విశాల్ గున్ని ముస్లిం పెద్దలకు సూచించారు. 7వ తేదీ నెల్లూరు కోటమిట్ట మన్సూర్‌నగర్‌లోని మీరామొహిద్దీన్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తన స్వంత నిధులతో దర్గా చుట్టూ మ్యాట్ వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడి చిన్నారులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. అనంతరం జెండావీధి, కోటమిట్ట ప్రాంతాల్లో పర్యటించారు.

## 'వాకర్స్' సేవలు స్ఫూర్తిదాయకం



పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరులోని ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌వారు వర్ధమాన క్రీడాకారులకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమైనవని, అందరికీ స్ఫూర్తిదాయకమైనవని ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అభినందించారు. ఆదివారం ఈ వాకర్స్ అసోసియేషన్‌వారు క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వర్ధమాన క్రీడాకారులు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి, జోయాలుక్కాస్ సంస్థ తోడ్పాటుతో ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో క్రీడాశిక్షణా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న 8 వందల మందికిపైగా క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, ఎం.వి సుబ్బారెడ్డి, డి. నరసింహారావు, మైథిలి మనోహర్‌రెడ్డి, ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, బాసం శేషగిరిరావు, వేణుగోపాల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, చంద్రమౌళి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథ స్వామి ఆలయ ఛైర్మన్‌గా మంచికంటి సుధాకర్

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా నందమూరి బాలకృష్ణ వీరాభిమాని మంచికంటి సుధాకర్ నియమితుడయ్యాడు. ఈ పదవి కోసం పలువురు పోటీ పడ్డారు. ముఖ్యంగా మంత్రి నారాయణ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు సహకారంతో ఆర్యవైశ్య వర్గాల నుండి కోట గురుబ్రహ్మం తీవ్రంగా కృషి చేశాడు. అయితే ఈ విషయంలో బాలకృష్ణ పట్టు బట్టాడు. తెలుగుదేశంపార్టీ పెట్టకముందు నుండి కూడా సుధాకర్ బాలకృష్ణ అభిమాని. ఆయన అభిమాన సంఘం అధ్యక్షుడు కాడా! బాలకృష్ణ నటించిన ఎన్నో సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా కూడా వ్యవహరించి ఆర్థికంగానూ నష్టపోయాడు. 1983 నాటి రమేష్‌రెడ్డి బ్యాచ్‌కు చెందినవాడు. గత కొన్నేళ్లుగా ఫీల్డ్‌లో లేడు. రాజకీయంగా పార్టీలో పెద్దగా పనిచేసింది లేదు. కేవలం బాలకృష్ణ పై పెంచుకున్న అభిమానమే ఈరోజు అతనిని రంగనాథ స్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా చేసింది.



బాలకృష్ణతో మంచికంటి సుధాకర్

ఇక పాలకమండలిలో సభ్యులుగా బి.వెంకయ్యయాదవ్, ఆకుల హనుమంతరావు, గాదంశెట్టి చంద్రశేఖర్, రంగాచారి వెంకటేష్, కాకరపర్తి జగన్మోహన్‌రావు, వొమ్మిన జనార్దన్, చింతగుంట మంగమ్మ, దాతబిందూరు జగన్మోహన్‌రావు, ఉప ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులను సభ్యులుగా నియమించారు.

## డాక్టర్ భక్తవత్సలరెడ్డికి 'వైద్య రత్న' అవార్డు

నెల్లూరు నగరంలోని సింహపురి ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణునిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డికి ఆయన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన 'వైద్య రత్న' అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ భక్తవత్సలరెడ్డికి టిఆర్ఎస్ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గుండె వైద్యంలో అత్యంత అధునాతన పద్ధతుల్లో డాక్టర్ భక్తవత్సలరెడ్డి హృద్రోగులకు చికిత్సలు నిర్వహించి సేవలు చేయడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో



ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణారావు, యాదయ్య, తెలంగాణ బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి ఛాయాదేవి, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, సుమన్ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు పి.సుమన్, కార్యదర్శి కె. ప్రతీక్ పాల్గొన్నారు.

## మహిళా వాకర్స్‌కు ఘన సన్మానం



ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా నెల్లూరు విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా వాకర్స్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సులోచన, శైలజ, జమునారాణి, కృష్ణవేణి, హైమావతి తదితరులను సత్కరించారు. అమ్మ ప్రేమానురాగాలను డాక్టర్ సులోచన, డాక్టర్ శైలజలు వివరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ భాస్కర్‌రావు, కార్యదర్శి రమణమూర్తి, కోశాధికారి వెంకటేశ్వర్లు, మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ చంద్రలీల, సభ్యులు అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్‌లో ఉపాధ్యక్షుల నియామకం

నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీలో కొత్తగా ఏడుమంది ఉపాధ్యక్షులను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. బి.వేణుగోపాల్‌రెడ్డి(సూళ్లూరుపేట), వై.మధుసూదనరెడ్డి(గూడూరు), ఎల్.సురేష్‌బాబు(కావలి), ఎన్.గోపాల్‌రెడ్డి(కోవూరు), వి.మధుసూదన్‌రెడ్డి(వెంకటగిరి), ఎస్.బాలయ్య(ఉదయగిరి), శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం మాజీ ఛైర్మెన్ పత్తి రవీంద్రబాబు తనయుడు పత్తి సీతారాంబాబు(నెల్లూరు)లను నియమించినట్లు ఇటీవల ప్రకటించారు.



పత్తి సీతారాంబాబును అభినందిస్తున్న పనబాక కృష్ణయ్య

### బిసి కార్పొరేషన్

## ఇ.డిగా వెంకటస్వామి

నెల్లూరుజిల్లా బిసి కార్పొరేషన్ ఈడిగా వెంకటస్వామిని నియమించారు. ప్రకాశం జిల్లా కో-ఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామిని డిప్యూటేషన్‌పై బిసి కార్పొరేషన్ ఈడీగా నియమించారు. గతంలో ఆయన గూడూరు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

### పసిడి అమ్మకాలకు

## మూఢం పట్టింది

ప్రతి ఏడాది అక్షయ తృతీయ నాడు బంగారు దుకాణాలు కళకళ లాడుతుంటాయి. ఆ ఒక్క రోజే కోట్ల రూపాయల్లో అమ్మకాలు జరుగుతుంటాయి. అయితే ఈసారి మూఢంలో అక్షయ తృతీయ రావడంతో బంగారం అమ్మకాలు దాదాపు 50శాతం పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

### టోల్‌గేటుపై

## కార్పొరేషన్ తీర్మానం వేటు

నెల్లూరు నగరం పరిధిలో కనుపర్తిపాడు వద్ద జాతీయ రహదారిపై నిర్మించ తలపెట్టిన టోల్‌గేటును వద్దంటూ నెల్లూరు నగరపాలక సంస్థ తీర్మానం చేసింది. 54మంది కార్పొరేటర్లు సంయుక్తంగా టోల్‌గేట్‌ను వ్యతిరేకించారు. 9వ తేదీన కౌన్సిల్ హాల్‌లో టోల్‌గేటు, ఇంకుడుగుంటలు కుళాయిల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. మేయర్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, తెలుగుదేశం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ జడ్.శివప్రసాద్, వైకాపా ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఇ ఇమాముద్దీన్‌లతో పాటు కార్పొరేటర్లు హాజరయ్యారు.

# ఎంసెట్‌లో విశ్వసాయి విజయకేతనం




2016 ఎంసెట్ ఇంజనీరింగ్ ఫలితాలలో విశ్వసాయి విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరచి రాష్ట్రంలో, జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారని కళాశాల ఛైర్మెన్ డా॥ యన్.సత్యనారాయణ మరియు వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా మాగుంట లే అవుట్ అన్నమయ్య సర్కిల్‌లోని విశ్వసాయి కళాశాల ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ ఎంసెట్ ఇంజనీరింగ్ పరీక్షకు విశ్వసాయి నుండి హాజరైన అతితక్కువ మంది విద్యార్థులలో మౌనిక్ నరసింహ 1597వ ర్యాంకును, శ్రీహర్ష 3663వ ర్యాంకు, సాయికృష్ణతేజ 3720 ర్యాంకు, శ్రీనివాసులునాయుడు 3958వ ర్యాంకును సాధించారని చెప్పారు. 8మంది విద్యార్థులు 10,000లోపు ర్యాంకును, 15మంది విద్యార్థులు 15000లోపు ర్యాంకు సాధించారని, వీరందరూ రాష్ట్ర ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలలో సీట్లు పొందగల అర్హత సాధించారని వారు తెలిపారు.

# మాతృదేవోభవ..!

## • ఎస్పీ బాలు తల్లికి కళాసంఘాల సత్కారం

ప్రముఖ సినీసంగీత నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మను నెల్లూరులోని పలు కళాసంఘాల ప్రతినిధులు, గాయకులు, కళాకారులు అనేకమంది ఘనంగా సత్కరించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిప్పరాజువారి వీధిలోని ఆమె నివాసానికి వెళ్ళి, ఆ మాతృమూర్తిని ఘనంగా సన్మానించుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన గాయకుడు తల్లి అయిన శకుంతలమ్మను గౌరవపూర్వకంగా సత్కరించి ఆమె ఆశీస్సులను అందుకున్నారు. మురలీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రతినిధి నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ, నెల్లూరు నుంచి మేటి గాయకునిగా ఎదిగిన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తిని మాతృదినోత్సవం సందర్భంగా సత్కరించడం సముచితంగా వుంటుందని భావించి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.



ఈ కార్యక్రమంలో భిక్షాటనపూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ప్రతినిధులు, కళాంజలి సాంస్కృతిక సంస్థ అధినేత కళాంజలి అనంత్, కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ కేతా సుబ్బారావు, ప్రముఖ రచయిత–కడప ఉప కార్మిక కమిషనర్ రాచపాళెం రఘు, స్థానిక ప్రముఖులు అచ్యుత సుబ్రహ్మణ్యం, ప్రముఖ సంగీత విద్వాంసులు డివి సురేష్‌రావు, రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి తదితరులతో పాటు, విజేత ఆర్ట్స్, రోటరీక్లబ్ నెల్లూరు సౌత్, ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్, రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, నెల్లూరుజిల్లా రచయితల సంఘం, టిటిడి ధర్మ ప్రచార మండలి, ఎస్‌విఆర్ స్కూల్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, నూర్‌బాషా సంక్షేమ సంఘం తదితర సంఘాలు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# రైతులను ఇబ్బంది పెడితే సహించం

**- కోటంరెడ్డి**



కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం అధికారులు రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఘాటుగా హెచ్చరించారు. 9వ తేదీ ఆయన నెల్లూరురూరల్ పరిధిలోని వల్లూరుకాలువ ఆయకట్టు రైతులతో కలిసి ఇరిగేషన్ కార్యాలయంకు వెళ్లారు. ఇరిగేషన్ ఎస్‌ఇ నారాయణను వల్లూరు కాలువకు నీళ్లు ఎందుకు వదలడం లేదని నిలదీశారు. వల్లూరు కాలువ పెన్నార్ డెల్టాలో భాగమని, మాదరాజుగూడూరు, గమళ్లపాలెం, రంగాచార్యుల వారి కండ్రిక గ్రామాలలో నాలుగువేల ఎకరాల్లో రెండో పంటను వేసేందుకు రైతులు సిద్ధంగా వున్నారని, ఐఏబి సమావేశంలోనూ దీనిని తీర్మానించారని, మరి నీళ్లు ఎందుకు వదలడం లేదని నిలదీయగా, పంటపాలెం చెరువు, సర్వేపల్లి కాలువ అధ్యక్షులు చేసిన విజ్ఞప్తి మేరకే నీళ్లు ఆపామని ఎస్‌ఇ నారాయణ చెప్పాడు. దీంతో ఎమ్మెల్యే కోటంరెడ్డికి అరికాల్లో మండి... రైతులు, స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయం తీసుకోకుండా నీళ్లు ఎలా ఆపుతారని, ఇరిగేషన్ ఎవడబ్బ సొత్తుకాదని, అధికారులు కాంట్రాక్టర్ల కోసం కాకుండా రైతుల కోసం పనిచేయాలంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.




ప్రథమ వర్ధంతి

మా ఇంటి దీపం, మా అమ్మ

మాగుంట శ్యామలమ్మ గారు

(లేట్ గోవిందరెడ్డి గారి సతీమణి)

చిన్నచెరుకూరు గ్రామం, నెల్లూరుజిల్లా.

మమ్ము వీడి దైవ సన్నిధికి చేరి

తే. 11-05-2016ది నాటికి ఏడాది గడిచిన సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కుమారులు :

మాగుంట వెంకటనారాయణరెడ్డి

మాగుంట పట్టాభిరామిరెడ్డి

మాగుంట శివకుమార్‌రెడ్డి



# గూడూరు డివిజన్ వార్తలు

## చరిత్ర హీనులుగా మిగిలిపోతారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి మేకపాటి

వైకాపా గుర్తుపై గెలిచినవారు పార్టీని వీడితే చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సిఆర్ మార్టు కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన వైకాపా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్తి స్థాయిలో మెజార్టీ ఉన్నా వైకాపా ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి పార్టీలోకి చేర్చుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటివరకు 17మంది వైకాపా ఎమ్మెల్యేలను తెలుగుదేశంలో అనైతికంగా చేర్చుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీరు ఎన్ని కుతంత్రాలు పన్నినా పార్టీకి ప్రజల్లో ఇంకా విశ్వాసం ఉందన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారు రాజీనామా చేసి గెలవాలన్నారు. వీరిపై స్పీకరు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైకాపా ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సంజీవయ్య, రాష్ట్ర నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు మల్లు విజయకుమార్‌రెడ్డి, నాశిన నాగులు, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నోరు అదుపులో పెట్టుకోండి

### - వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలకు పాశం హెచ్చరిక

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు అదుపులో పెట్టుకోవాలని, దళిత ఎమ్మెల్యే అంటే అంత అలుసా అంటూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరులో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లాలోని వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలు మాట్లాడిన తీరుపై మండిపడ్డాడు. ఒక దళిత ఎమ్మెల్యేపై మూకుమ్మడిగా వారు ధ్వజమెత్తడం సమంజసం కాదన్నారు. తనను వైకాపా ఎమ్మెల్యేలు బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. వాస్తవంగా నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై చట్టప్రకారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. అయితే తనకు గతంలో సాయం చేయడంతో ఊరుకుంటున్నట్లు చెప్పారు. పని గట్టుకుని తన నియోజకవర్గంలోని గూడూరుకు వచ్చి తనను దూషించడం తగదన్నారు. తాను కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందన్నారు. తాను డబ్బులకు అమ్ముడుపోయేవాడిని కాదన్నారు. తన



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం

కుమారుడు ఎంబిబిఎస్ కోర్సు చదువుతున్నాడని, ఆయన ఫీజులు స్వచ్ఛంద సంస్థ సహాయంతో కడుతున్నట్లు చెప్పారు. తాను రాజీనామా చేయడానికి సిద్ధమని, దమ్ముంటే వైకాపా నాయకులు గెలుచు కోవాలని సవాల్ విసిరాడు. తాను నోరు విప్పితే అందరిగుట్టు బయటపడుతుందన్నారు. ఇకనైనా తనపై అవాకులు, చవాకులు పేలడం మానాలని హితవు పలికారు.

## ఎల్ఏపి విద్యార్థుల హవా

గూడూరు పట్టణ సమీపానున్న శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి భానోదయ శిరిడిసాయినాథ్‌రెడ్డి పదవ తరగతి ఫలితాల్లో 10కి 10పాయింట్లను సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్లు బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు మంగళవారం తెలిపారు. పాఠశాలలో 39మంది విద్యార్థులు 9పాయింట్లతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.



శిరిడిసాయినాథ్‌రెడ్డి

## రవాణాశాఖ కార్యాలయంలో పారదర్శక సేవలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీవో చందర్, జకీర్, కరుణాకర్, సౌజన్య, మదాని మరియు సిబ్బంది

గూడూరు రవాణాశాఖ కార్యాలయంలో పారదర్శక సేవలు అందిస్తున్నట్లు ఆర్టీవో బి.చందర్ తెలిపారు. ఆయన తమ కార్యాలయంలో బుధవారం నాడు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తమ ఆఫీసుకు వచ్చే ప్రజలు ఎటువంటి మధ్యవర్తులను లేదా దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమ కార్యాలయానికి రావాలని అన్నారు. ఈ ఆఫీసులో గూడూరు మరియు నాయుడుపేట డివిజన్ పరిధిలోని ప్రజలకు తమ సేవలు అందజేస్తామన్నారు. ప్రజలకు పారదర్శకంగా త్వరితగతిన సేవలు అందించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యమ్.ఎ.జకీర్, ఎమ్‌విఐలు కరుణాకర్, సౌజన్య, ఎ.ఓ. మదాని మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరి దగ్గర ప్రతిజ్ఞ చేయించారు.

## నేరాలను నియంత్రించాలి - డిఎస్పీ బి.శ్రీనివాస్



గూడూరు డివిజన్ పరిధిలో నేరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన డివిజన్ పరిధిలోని సిఐ, ఎస్సైల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17 నుంచి జరుగనున్న రాపూరు మండలంలోని పెంచలకోన నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే జిల్లాలో దోపిడీలు, గుడిలో దొంగతనాలు, హత్యలు చేసే ముఠాలు సంచరిస్తున్నాయని, వాటిని పట్టుకునేందుకు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు.

ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, అక్కేశ్వరరావు, రత్తయ్య, విజయకృష్ణ, శ్రీనివాసులు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# కళాసేవలో తరిస్తున్న.. గూడూరు సంస్కృతి సమ్మేళనం

## • 62 ఏళ్ళుగా అలుపెరుగని సేవ

గూడూరులోని 'సంస్కృతీ సమ్మేళనం' కళాసంస్థ అంటే జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా కళారంగంలో అందరికీ సుపరిచితమే. గత 62 సంవత్సరాలుగా ఈ సంస్థ కళారంగానికి ఎనలేని సేవలు అందిస్తూనే వుంది. ప్రతి ఏటా చైతన్యవంతమైన, ప్రజోపయోగకరమైన..రసరమ్యభరితమైన నాటికలను ఎంపిక చేసుకుని ప్రదర్శిస్తూ నాటక రంగాన్ని ప్రోత్సహిస్తూనే వుంది. ఈ సంస్థ నుంచే ఎందరో నటులు, నటీమణులు, దర్శకులు తమ నటనా వైదుష్యానికి మెరుగులు దిద్దుకున్నారు. మరెందరో ఈ వేదిక మీద తమ కళాప్రతిభను ప్రదర్శించి చలనచిత్రసీమలో కూడా అద్భుతంగా రాణించారు.

ముఖ్యంగా, కళాభినేత్రి వాణిశ్రీ, మహానటి శారద, అమోఘమైన నటనా ప్రతిభ కలిగిన నిర్మలమ్మ, ఇంకా శకుంతల, ప్రభ, ప్రఖ్యాత హాస్యనటుడు రమణారెడ్డి, పి.ఎల్ నారాయణ, జయప్రకాష్‌రెడ్డి.. ఇలా ఎందరో మహామహులు..అంతా గూడూరు సంస్కృతీ సమ్మేళనంలో నాటకాలు ఆడినవారే. మరెందరో ప్రఖ్యాత నటులు, సినీరంగ ప్రముఖులు కూడా ఇక్కడికి విచ్చేసి ఈ కార్యక్రమాల్లో పాల్గొని కళాకారులను ప్రోత్సహించి ఆదరించినవారే. శ్రీయుతులు అక్కినేని నాగేశ్వరరావు, నాగయ్య, రాజనాల, శ్రీశ్రీ, ఆచార్య ఆత్రేయ, గుమ్మడి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని, చంద్రమోహన్, గొల్లపూడి, సిఎస్ రావు, డా.రాజారావు, తాపీ ధర్మారావు, అనిసెట్టి, కవిత, కోట శ్రీనివాసరావు, కొండవలస లక్ష్మణరావు, సుత్తి వేలు, గుండు హనుమంతురావు, కుమారి గీతాసింగ్, సిహెచ్ నారాయణరావు, కొడాలి గోపాలరావు, కత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాములు, డిఎస్ దీక్షితులు, కర్నాటి లక్ష్మీనరసయ్య, కెఎస్‌టి సాయి, నూతలపాటి సాంబయ్య, శివపార్వతి మొదలైన ఉద్దండులెందరో సంస్కృతీ సమ్మేళనానికి వచ్చి కళాకారులు ప్రదర్శించిన అనేక నాటికలను తిలకించి అభినందించినవారే.

'కావ్యేషు నాటకం రమ్యమ్'..అన్నారు పెద్దలు. అంటే, కావ్యాలన్నింటిలోకీ 'నాటకం' రమ్యమైనదని అర్థం. సాహిత్య ప్రక్రియలు ఎన్ని వున్నా, నాటకం ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. తెలుగునాట చారిత్రికంగా గమనించినట్లయితే అనేక ఉద్యమాలకు, ప్రజా చైతన్యానికి ఊపిరులూదింది నాటకాలే. కన్యాశుల్కం, రక్తకన్నీరు, పునర్జన్మ వంటి ఎన్నో సాంఘిక నాటకాలు ప్రజల్లో చైతన్యం తెచ్చాయి. సంఘసంస్కరణాభిలాషను పెంపొందించాయి.

ఈ నేపథ్యంలో, గూడూరులో ఎంతో విశేషంగా ప్రతిఏటా సాంఘిక నాటికల పోటీలు జరగడం, ఎంతోమంది కళాకారులు ఈ ప్రదర్శనలకు రావడం, ప్రజలు కూడా పెద్దసంఖ్యలో వచ్చి ఈ నాటికలు తిలకించడం విశేషం.

## ఉత్తమనటిగా మా అమ్మకూ ఇక్కడ అవార్డు

### - సినీనటి రాజ్యలక్ష్మి



శంకరాభరణం రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్, పక్కన డిఎస్పీ బి.శ్రీనివాస్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితరులు

ఈ నాటికల పోటీ బహుమతి ప్రదానోత్సవానికి విచ్చేసిన ప్రముఖ సినీనటి, శంకరాభరణం చిత్రంలో నటించిన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, గూడూరు సంస్కృతి సమ్మేళనం అంటే తమకెంతో ఇష్టమని, తన తల్లి తెనాలి వాస్తవ్యురాలైన శ్రీమతి సభా రంజని గతంలో ఈ వేదిక మీదే నాటిక ప్రదర్శించి అత్యద్భుత నటనతో ఉత్తమ నటీమణి అవార్డు అందుకుందని అందరి కరతాళధ్వనుల మధ్య అన్నారు. కళాకారులను ప్రోత్సహించే ఈ సంస్థ కలకాలం కొనసాగాలని, నాటక రంగానికి మంచి ప్రోత్సాహాన్ని అందిస్తూనే వుండాలని ఆమె మనసారా ఆకాంక్షించారు.

### సంస్కృతి సమ్మేళనం..బహుముఖ సేవలు :

ఈ సంస్థ కేవలం నాటికల పోటీలనే కాక, తెలుగు భాష, సాహిత్యాల అభివృద్ధికి కూడా ఎనలేని సేవలు చేస్తోంది. 'సాహిత్య పంచమి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రతి ఏటా అయిదురోజుల పాటు గూడూరులో (మిగతా 11వ పేజీలో)

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక పరిస్థితులు స్వల్పంగా ఇబ్బందికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయ ముంటుంది. బంధువర్గం వారి వ్యాఖ్యానాల వల్ల విభేదాలు రావచ్చును. అనుకున్న పనులు ఆలస్యం కాగలవు. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. ఆర్థిక లావాదేవీలు స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా పడటం మంచిది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూర ప్రయాణాలుంటాయి. రావలసిన బాకీలు వసూలు కావడం, ప్రభుత్వ అనుమతులు పొందడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. పరీక్షలందు విద్యార్థులకు సంతృప్తి ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. ఆకర్షణీయ పథకాలలో వ్యాపారాలు ఊపు అందుకొనగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఇతరుల విషయాలలో శ్రద్ధ చూపకండి. ఉద్యోగుల సమర్థతకు గుర్తింపు ఉంటుంది. యజమానులకు నిర్మాణాలు చేసేవారికి వర్కర్లతో ఇబ్బందులుంటాయి. పర్యటనలు అదనపు బాధ్యతలుంటాయి. బంధువర్గంతో సామరస్యంగా పరిష్కారాలు జరుపుకొంటారు. ఈ వారం ఖర్చులు అదనంగా ఉంటాయి. కొత్త పరిచయాలు కలుగుతాయి. పనులు నిదానంగా జరుగుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బిడ్డల విద్యా వివాహములందు శ్రద్ధ చూపుతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత మేరకు అందుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త ఆర్థిక ప్రయత్నాలకై కృషి చేస్తారు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. అనవసర విషయాలలో తల దూర్చడం, సలహాలివ్వడం చేయవద్దు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికాభివృద్ధి అవకాశాలు మందగిస్తాయి. విద్యార్థులకు పరీక్షలందు సామర్థ్యం బాగుంటుంది. భాగస్వామిక ఒప్పందాలు జరుగుతాయి. సొంత పనులు జరగడానికి బాగా శ్రమపడాలి. దూర ప్రయాణాలు, విదేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సామాన్యంగా ఉంటాయి. బాంధవ్యాలు బలపడతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బిల్డర్లకు, యజమానులకు కార్మికులతో సమస్యలు ఏర్పడవచ్చును. ఉన్నత విద్యావకాశాలు కలవు. ఆరోగ్యం సంతృప్తికరం. భాగస్వామిక చర్యలు ఫలిస్తాయి. శుభ కార్య ప్రయత్నాలు ఆలస్యం కాగలవు. కొత్త కాంట్రాక్టులు లీజులకు అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులు ఆటంకాలతో సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వాటిని అధిగమించే కృషి చేస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 13.5.2016 నుండి
తేది. 19.5.2016 వరకు

**ఈ వారం మేష రాశిలో రవి బుధ శుక్రులు, 14తేది నుండి వృషభంలో రవి, కర్కాటక సింహ కన్య తుల రాశిలో చంద్రుడు, సింహంలో గురురాహువులు, వృశ్చికంలో కుజ శనులు, కుంభంలో కేతువు సంచరిస్తారు.**

### పంచాంగము:

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

ముహూర్తములు లేవు

### వైశాఖ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | సప్తమి | ప॥ గం.2.30వ॥ |
| తేది. 14 | శని | అష్టమి | ప॥ గం.2.39వ॥ |
| తేది. 15 | ఆది | నవమి | సా॥ గం.3.40వ॥ |
| తేది. 16 | సోమ | దశమి | సా॥ గం.4.21వ॥ |
| తేది. 17 | మంగళ | ఏకాదశి | సా॥ గం.5.53వ॥ |
| తేది. 18 | బుధ | ద్వాదశి | రా॥ గం.7.43వ॥ |
| తేది. 19 | గురు | త్రయోదశి | రా॥ గం.9.44వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బిడ్డలకు విద్యావృద్ధి, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. ముఖ్య విషయాలందు మంచి వ్యక్తుల సలహా పొందడం జరగాలి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. వ్యవహారాలలో ఇతరులు సమస్యలను సృష్టిస్తారు. ఉత్తమ వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ప్రభుత్వ సంబంధిత పనులు, అనుమతులు ఆలస్యం కాగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకోని ప్రయాణాలుంటాయి. తొందరపాటు మాటలు ప్రవర్తనల వల్ల ఇబ్బందులు పడతారు. చేపట్టిన పనులను విజయవంతంగా నెరవేర్చుతారు. ఆరోగ్య లోపం కొద్దిగా ఇబ్బంది పెడుతుంది. ఆర్థిక పరిపుష్టి ఉంటుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం కలవారికి సామాన్య స్థితి ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా వృత్తి వ్యాపారాలలో అసంతృప్తిగా ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడి పోయినా చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఉద్యోగులకు అధికారులతో సామాన్యంగానే ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులను వాయిదా వేసి కొనడం మంచిది. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. అనుకున్న పనులు వాయిదా పడగలవు.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగ వర్గాలకు బాధ్యతలలో మార్పులుంటాయి. నూతన వస్తు సామాగ్రిని సమకూర్చుకొనడం, దైవ, సేవా కార్యములలో పాల్గొనడం జరుగుతుంది. ఆత్మీయులకు సహాయము చేస్తారు. కుటుంబ సౌఖ్యముంటుంది. ఆస్తుల లావాదేవీలు, బినామి వ్యవహారాలు ప్రస్తుతం వద్దు. వృత్తి జీవనము, ఉద్యోగ జీవనము కలవారికి అదనపు ఆదాయం ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. ఇతరుల విషయాలను పట్టించుకోవద్దు. ఉద్యోగులకు అధికారులకు అదనపు బాధ్యతలు, పని భారం ప్రయాణాలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ప్రభుత్వ అనుమతులు పొందడం జరుగుతుంది. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకొని పనులు జరుపుకొంటారు. అయితే ఎక్కువగా టెన్షన్ ఉంటుంది. కుటుంబసభ్యులతో స్వల్ప విభేదాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనవలసి ఉంటుంది. ప్రముఖులతో అధికారులతో సత్సంబంధాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలమైన అవకాశాలు లభించగలవు. ఇతరుల వ్యవహారాలలో తల దూర్చడం గాని, ఋణాలివ్వడం గాని చేయకూడదు. చేపట్టిన వ్యవహారాలలో పేచీలు రావచ్చును.

# ఢిల్లీలో ఏపి నేతలకు 'గజనీ' షో

శ్రీను గల్పిక

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం. ఏ.పి. ముఖ్యమంత్రి హైటెక్ రత్న చంద్రబాబు అప్పుడే నిద్రలేచాడు. కళ్లు నులుముకుంటూ హాల్‌లోకి వచ్చాడు. అక్కడ పాకుతున్న దేవాన్ష్‌ను ఎత్తుకుని తనివితీరా ముద్దులాడాడు. నిద్ర లేవగానే దేవాన్ష్‌ను చూడనిదే ఆయనకు పనిలో వేలు పెట్టను మనసు రావడం లేదు. దేవాన్ష్‌ను బ్రాహ్మణికి ఇచ్చి ఆనాటి 'ఈనాడు' పత్రికను చేతికి తీసుకున్నాడు. మొదటి పేజీలోనే "ఏపికి ప్రత్యేక హోదా లేదు" అంటూ కేంద్రమంత్రి జయంత్ సిన్హా ఇచ్చిన ప్రకటన వుంది. అది చూడగానే చంద్రబాబుకు బి.పి. పెరిగింది. ప్రత్యేక హోదా ఇవ్వరనే విషయం నాకూ తెలుసు. సగం ఏపి ప్రజలకు తెలుసు. మళ్లీ మధ్యలో ఈ స్టేట్‌మెంట్లు ఇచ్చి రెచ్చగొట్టడం ఎందుకు, వీళ్లతో పెద్ద తలనొప్పి అవుతోంది. దీనిని కవర్ చేసుకోవాలంటే ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నట్లు సీన్ క్రియేట్ చేయాలి. మిగతా పార్టీల వాళ్లను కూడా పిలిచి ఇందులో ఇన్‌వాల్వ్ చేస్తే వాళ్లు నా మీద రాళ్లు వేయడం తగ్గిస్తారని మనసులో అనుకున్నాడు. వెంటనే వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, రఘువీరారెడ్డి, బి.వి.రాఘవులు, సిపిఐ చికెన్ నారాయణ, లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణలకు ఫోన్‌లు చేశాడు. పార్టీలు వేరైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం మనమంతా కలిసి పని చేయాలి. ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై పోరాడాలి. మీరు నా వెంట వుంటే కేంద్రంతో చెడుగుడు ఆడేస్తానంటూ సినిమాలో జయప్రకాశ్‌రెడ్డి లెవల్లో డైలాగ్‌లు వాడాడు. రాష్ట్రం పట్ల మీరు ఇంత శ్రద్ధ చూపిస్తే మేం కాదంటామా... అని వీళ్లు చంద్రబాబు వెంట వెళ్లడానికి ఒప్పుకున్నారు.

★★★★★

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి ఉదయం 6గంటలకే ప్రత్యేక విమానంలో అఖిలపక్ష నాయకులు, రాష్ట్ర మంత్రులు బయలుదేరారు. చంద్రబాబు, జగన్, సిపిఐ నారాయణలు ఒకరి పక్కన ఒకరు కూర్చున్నారు. విమానం టేకాఫ్ కావడానికి రన్‌వే మీదకొచ్చింది. ఎయిర్ హోస్టెస్ మైక్‌లో... విమానం టేకాఫ్‌కు సిద్ధంగా వుంది, అందరూ బెల్టులు పెట్టుకోండి అని అనౌన్స్ చేసింది. జేసీ దివాకర్‌రెడ్డి, అంబటి రాంబాబు లేచి చొక్కాలెత్తి... మేం ఇళ్ల దగ్గర బయలుదేరేటప్పుడే బెల్టులు పెట్టుకొచ్చాం... అంటూ ఫ్యాంట్లకున్న బెల్టులు చూపించారు. వారిని చూసి ఎయిర్ హోస్టెస్ మైక్‌ను తలకేసి బాదుకోగా, మంత్రి నారాయణ వారి వద్దకెళ్లి, ఇవేవో పెద్ద ఆస్తులు మాదిరిగా చూపిస్తున్నారు, బెల్టులంటే ఇవి కాదు, సీటు బెల్టులు అంటూ వారికి తనే సీటు బెల్టులు బిగించాడు. తర్వాత విమానం గాల్లోకి ఎగిరింది. ఎర్లీమార్నింగ్ కావడంతో ఎవరూ టిఫిన్ తినలేదు. ఎయిర్‌హోస్టేస్ ట్రాలీని తోసుకుంటూ వస్తూ అందరికీ పిజ్జాలు, బర్గర్‌లు అందించసాగింది. వాటిని చూసిన సిపిఐ నారాయణ వెంటనే తాను తెచ్చుకున్న సంచిలో వున్న టిఫిన్ బాక్స్‌ను ఓపెన్ చేశాడు. మసాలా వాసన విమానమంతా గుప్పుమంది. పిజ్జాలు, బర్గర్‌లు తింటున్న వాళ్లంతా నారాయణ చికెన్, దోశల వైపు చూడసాగారు. ఆయన ఎవరినీ పట్టించుకోకుండా దోశె, చికెన్ లాగించేసి వేళ్లు నాక్కున్నాడు. జగన్ మాత్రం తన అమ్మ చేసిచ్చిన జొన్న రొట్టెలను తినగా, చంద్రబాబు మాత్రం యధాఫలంగా డ్రైఫ్రూట్స్‌తో సరిపెట్టుకున్నాడు. మధ్యలో జగనే జొన్నరొట్టెను ఆఫర్ చేస్తే... నా ఒంటికి ఇలాంటివి పడవని చంద్రబాబు తిరస్కరించాడు. బ్రేక్‌ఫాస్ట్ ముగిసాక జగన్‌తో చంద్రబాబు మాటలు కలిపాడు. నిన్ను చూస్తుంటే నాకు పాపమనిపిస్తుంది జగన్. అంత మంది ఎమ్మెల్యేలను కష్టపడి గెలిపించుకున్నావు. కాని వాళ్లంతా నిన్ను వదిలేసి నా వద్దకు వస్తున్నారు. ఏదో ఒకటి చేసి ఆ ఎమ్మెల్యేలను నిలబెట్టుకోకూడదూ అని సానుభూతిగా మాట్లాడాడు. అందుకు జగన్... ఆ ఎమ్మెల్యేలు ఎవరి దగ్గర వుంటే ఏముందిలే సార్, మీ దగ్గర వుంటే ఒకటి, నా దగ్గరుంటే ఒకటా... ఇంకా మీ దగ్గరుంటేనన్నా నాలుగు రూపాయలు సంపాదించుకుంటారు. వాళ్లను మీ దగ్గరే వుంచుకోండి అని చెప్పాడు. అంతలో ఢిల్లీ వచ్చేసినట్లు ఎయిర్ హోస్టెస్ అనౌన్స్ చేసింది. పాలెం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం ల్యాండయ్యింది.

★★★★★

ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం. ఆంధ్రా టీమ్ ముందు అక్కడికెళ్లింది. లోపల అమిత్‌షాతో పాటు కేంద్రమంత్రులు వెంకయ్య, అరుణ్‌జైట్లీలు వున్నారు. చంద్రబాబు జేబులో నుండి ఒక సిడిని తీసి అక్కడ కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేశాడు. స్క్రీన్ పైన 2013లో ఏపి విభజన బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టినప్పటి దృశ్యాలు రాసాగాయి. రాజ్యసభలో ఏపికి 5ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని మన్మోహన్‌సింగ్ హామీ ఇస్తే, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడులు లేచి... కాదు, పదేళ్లు కావాలంటూ వాదించారు. చంద్రబాబు ఆ సిడిని ఆఫ్ చేసి... సార్, ఏపికి ప్రత్యేకహోదాపై మీరు మాట్లాడిన మాటలు ఇవి, గుర్తొచ్చాయా అని అడిగాడు. అందుకు వెంకయ్య... వయసు పైబడుతుంది కదబ్బా... నిన్న జరిగినవే మాకు గుర్తుండడం లేదు. ఇంకెప్పుడో మూడేళ్ల క్రితం జరిగినవి ఏం గుర్తుంటాయి. అదీగాక నువ్వు చూపించింది మార్ఫింగ్ చేసిన సిడి లాగుంది. వేం రాజ్యసభలో అలా మాట్లాడినట్లు అసలు గుర్తే లేదన్నాడు. ఆయన మాటలతో చంద్రబాబుతో పాటు మిగతా వాళ్లకు కూడా వెయ్యికిలోమీటర్ల వేగంతో తలలు తిరిగాయి. ఇక ఇక్కడ లాభం లేదనుకుని అందరూ ప్రధాన మంత్రి కార్యాలయానికి చేరుకున్నారు. బయట సెక్యూరిటీ వుండి... సార్‌ను మీరు కలవాలంటే ఐడెంటిఫికేషన్ ఉండాలని చెప్పాడు. వీళ్లందరూ ఆధార్ కార్డులు చూపించారు. దానికి సెక్యూరిటీ... ఈ కార్డులు కాదు, సార్ తన ఫ్రెండ్స్‌తోనే మాట్లాడుతారు. మీరు ఆయనతో దిగిన ఫోటోలు ఉంటే చూపించండి, మిమ్మల్ని గుర్తుపడతారు అని చెప్పాడు. మమ్మల్ని గుర్తుపట్టడమేమిటి, నేను ప్రపంచమంతా తెలుసు అని చంద్రబాబు చెప్పుకున్నాడు. మీరు ప్రపంచానికి తెలుసేమో, మా ప్రధానికి తెలుసుండకపోయి ఉండొచ్చు... ఈమధ్య గంగానదిలో స్నానం చేసేటప్పుడు ఓ చేప తోకతో తలపై కొట్టడంతో ప్రధానికి మతిమరుపు వచ్చింది. కాబట్టి మీరు ఆయనతో దిగిన ఫోటోలను చూపించండి, మాట్లాడుతాడు అని చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్ చెప్పాడు. అందరూ లోపలకెళ్లి మోడీకి ఆయనతో తాము తీయించుకున్న ఫోటోలు చూపించారు. మోడీ వాటిని చూసి వచ్చిన పని చెప్పమన్నాడు. చంద్రబాబు మళ్లీ ఒక సిడి తీసి కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేశాడు. 2013లో హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో నరేంద్రమోడీ పాల్గొన్న సభ... 'యూపిఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను దారుణంగా విభజించింది, బిడ్డను బయటకు తీసే క్రమంలో తల్లిని చంపేసింది" అని ఆవేశంగా ప్రసంగిస్తున్నాడు. ఆ సిడిని చివరిదాకా చూసిన మోడీ... ఇప్పుడు చెప్పండి, ఈ సినిమాను నాకెందుకు చూపించినట్లు అని అడిగాడు. ఆ మాటతో ఆంధ్రా నాయకులకు పట్టపగలే కళ్లముందు పాలపుంతలు, తోకచుక్కలు, నక్షత్రాలు కనిపించసాగాయి.

కొద్దిసేపటికి తేరుకుని అందరూ ప్రధాని కార్యాలయం నుండి బయటకొచ్చారు. జగన్, నారాయణ, రాఘవులు వుండి చంద్రబాబుతో... సార్, ఈ బీజేపీ వాళ్లంతా గజనీలయ్యారు. ఇప్పుడు మనమేం చేద్దామని అడిగారు. వెంటనే చంద్రబాబు... ఎవరు మీరు, ఎచట నుండి వచ్చారు, ఇంతకీ నా అశ్వం ఎటు పోయినది, నా సైనికులు ఏమయ్యారు, నా రాజ్యప్రజలు ఎలా వున్నారో వెంటనే పోయి చూసిరావలె అంటూ రోడ్డు మీద పరుగు లంఘించుకున్నాడు. అది చూసిన మిగతా నాయకులు ఈ బీజేపీవాళ్ల దెబ్బకు అందరికీ పిచ్చి పట్టడం ఖాయమనుకున్నారు.

# చిల్లు పెట్టి.. కొల్లగొట్టి..!

- ఆయిల్ మాఫియా మాయగాళ్ళ ఆట కట్టించిన పోలీసులు
- 13 మంది అరెస్ట్.. రూ. 60లక్షల పామాయిల్ స్వాధీనం



కష్టపడేవాడు అనుక్షణం కష్టపడుతుంటే, దోపిడీగాళ్లు రాత్రివేళ మాటువేసి ఆ కష్టాన్నంతా క్షణాల్లోనే దోచుకుపోతుంటారు. ఏమాత్రం ఏమరుపాటు వహించినా మాయగాళ్ళు ఉన్నదంతా ఊడ్చుకుపోతుంటారు. కృష్ణపట్నం పోర్టుకు సంబంధించిన పైప్‌లైన్ల విషయంలో కూడా దాదాపు ఇదే జరిగింది. ఆ పైప్ లైన్లకు కూడా చిల్లులు పెట్టి అందులో వెళ్తున్న పామాయిల్‌ను పెద్దఎత్తున దొంగిలించుకుపోయేందుకు కేటుగాళ్ళు పథకం వేసుకున్నారు. అయితే, గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్న ఈ రహస్య చోరులను పోలీసులు పసిగట్టి, దుండగుల గుట్టు రట్టు చేశారు. పామాయిల్‌ను పైపుల్లోంచే కాజేస్తున్న ఆ 13 మంది మాఫియా ముఠాను అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు 60లక్షల విలువచేసే పామాయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు, దుండగులు పామాయిల్ తరలించేందుకు సిద్ధం చేసుకున్న 5 లారీలను, మరో 2 కార్లను కూడా పట్టుకున్నారు. వీటి విలువ సుమారు 3కోట్ల దాకా వుంటుందని అంచనా. జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీతో పాటు, రూరల్ డిఎస్పీ, సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది అంతా కలసి పక్కా ప్రణాళికతో ఈ దుండగుల ఆట కట్టించారు. బుధవారం ఆ మాయగాళ్ళ వివరాలను ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాలిలా వున్నాయి. ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్ట్‌కు అనుసంధానంగా 7రిఫైనరీ ఫ్యాక్టరీలున్నాయి. నౌకల ద్వారా వచ్చిన ముడి పామాయిల్‌ను పోర్ట్‌లోని బెర్త్‌ల నుంచి పైప్‌లైన్ల ద్వారా నేరుగా ఆ ఫ్యాక్టరీలకే తరలిస్తుంటారు. అందుకు పది కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్లు వేశారు. ఈ విషయం తెలుసుకున్న ఈ మాఫియా ముఠా ఆ ముడి పామాయిల్‌ను భారీఎత్తున దొంగిలించడానికి పథకం వేసింది. ఈ దుండగుల ముఠా వారంతా కాకినాడ, గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేట, గణపవరం ప్రాంతాలకు చెందినవారని పోలీసులు గుర్తించారు. మొత్తం 13మంది ఒక ముఠాగా ఏర్పడి, కృష్ణపట్నం పరిసరాల్లో మకాం వేసి, ఈ పైప్‌లైన్ వెళ్ళే ప్రాంతాల్లో అక్కడక్కడా స్థలాలను లీజుకు తీసుకున్నారు. తామంతా ఫ్యాక్టరీల నుంచి పామాయిల్‌ను ఇతర ప్రాంతాలకు పంపుతుంటామని, ట్యాంకర్లు నిలుపుకునేందుకు స్థలం కావాలని అక్కడి ప్రజలను నమ్మించి, స్థలాలను లీజుకు తీసుకుని, ఆ స్థలాల్లో షెడ్ వేసుకున్నారు. ఇక అక్కడినుంచి తమ చేతివాటపు పని ప్రారంభించారు. జన సంచారం తగ్గిపోగానే, రాత్రి వేళల్లో పామాయిల్ పైప్‌కు చిల్లు పెట్టడం, ఆ పామాయిల్‌ను తమ ట్యాంకర్లలో నింపుకోవడం, నకిలీ వే-బిల్లులతో హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల్లోని రిఫైనరీ ఫ్యాక్టరీలకు అమ్మేయడం..ఇదీ తంతు. ఒక ట్యాంకర్ ముడి పామాయిల్ విలువ మార్కెట్లో సుమారు 12 లక్షలుంటే, దోచుకున్న సొత్తు కనుక కేవలం వీరు దానిని అయిదారు లక్షలకే అమ్మేసేవారు. గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ చోరీతో, అసలైన ఫ్యాక్టరీలకు రావాల్సిన ముడిపామాయిల్ తగ్గిపోతుండడాన్ని గమనించిన ఆయా ఫ్యాక్టరీలవారు ఆ పామాయిల్ ఎటుపోతోందో అర్థం కాక పోలీసులకు ఫిర్యాదు చేసి, జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. ఆ ముఠాను పట్టుకునేందుకు పోలీసు బృందాలు వ్యూహరచన చేశాయి. మరోవైపు ముఠాసభ్యుల్లో వచ్చిన విభేదాలు పోలీస్‌స్టేషన్‌దాకా రావడంతో, తీగ లాగితే డొంకంతా కదిలినట్లు మొత్తం వ్యవహారమంతా బయటకొచ్చింది. తొలుత పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా పామాయిల్ పైప్‌లైన్‌వద్ద సర్వేయర్‌గా పనిచేస్తున్న కోసు రాంబాబును అదుపులోకి తీసుకుని విచారించగా, కాకినాడకు చెందిన బొందు నారాయణ, చింతకాయల శ్రీను కలసి పంటపాళెం వద్ద పామాయిల్‌ను చోరీ చేస్తున్నట్లు గుర్తించారు. దొంగిలించిన ఆ పామాయిల్‌ను గుంటూరుజిల్లా చిలకలూరిపేటకు చెందిన చిలకల బాలాజీ, తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలుకు చెందిన చక్రధరరావు అలియాస్ శెట్టిలకు అమ్ముతున్నట్లుగా గుర్తించారు. దీంతో, చిలకలూరిపేట గణపవరంలోని గోదాములో బాలాజీని, అతని అనుచరుడైన రఘునాథ్, సీతారామయ్య, శ్రీనులను అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు ట్యాంకర్ల పామాయిల్‌ను, కాకినాడకు చెందిన నారాయణ అనుచరులైన నాగేశ్వరరావు, సిద్దూ, శంకర్, శ్రీధర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక ట్యాంకర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోర్ట్ సిఐ శ్రీనివాసరావును, ముత్తుకూరు ఎస్ఐ, పోర్ట్ ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## 14న 'సత్యశ్రీ' సాహితీ పురస్కారాలు

బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ప్రముఖ కవి మాటేటి రత్నప్రసాద్, వారి కుటుంబ సభ్యులు కలసి తమ తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన 'సత్యశ్రీ' సాహితీ పురస్కారాలు-2016 ప్రదానోత్సవం ఈ నెల 14న నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నవారికి ఈ పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రముఖ రచయిత్రి శ్రీమతి స్రవంతి ఐతరాజు, వైద్యరంగంలో ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, పద్యరచనలో పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, రాజకీయరంగంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, పాత్రికేయ రంగంలో సంపత్‌కుమార్, వచన కవిత్వంలో మద్దూరు శ్రీనివాసులు, సంగీత రంగంలో శ్రీమతి వీరేపల్లి లక్ష్మీభవాని, సేవారంగంలో శివాజీ యూత్‌ఫౌండేషన్ మోపూరు భాస్కరనాయుడు, ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు విజయ భరద్వాజ్‌రెడ్డిలను ఈ ఏడాది సత్యశ్రీ పురస్కారాలకు ఎంపిక చేశామని నిర్వాహకులు మాటేటి రత్నప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటయ్యే సభకు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి, టిటిడి ధర్మప్రచార పరిషత్ జిల్లా కన్వీనర్ శ్రీహరి, ప్రొహిబిషన్ సిఐ మార్టూరు శ్రీరామ్‌ప్రసాద్, విశ్రాంత ఉపన్యాసకులు బాలు సుబ్బారావు తదితరులు పాల్గొంటారని, సాహిత్యాభిమానులు, కవులు కళాకారులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



## కావలి కబుర్లు

### యస్‌సి వర్గీకరణకు

## చట్టబద్దత కల్పించాలి




రిలే దీక్ష చేస్తున్న యం.ఆర్.పి.యస్ నాయకులు

భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజులలో యస్.సి వర్గీకరణకు చట్ట బద్దత కల్పిస్తామని చెప్పి ఇంతవరకు పట్టించు కోవడం లేదని, వెంటనే చట్ట బద్దత కల్పించి ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని యం.ఆర్.పి.యస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి శ్రీనివాస మాదిగ డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని, డిల్లీ జంతర్ మంతర్ వద్ద యం.ఆర్.పి.యస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ రిలే దీక్షకు మద్దతుగా కావలిలో యం.ఆర్.పి.యస్ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. యం.ఇ.యఫ్ నాయకులు యం వెంకటేశ్వర్లు, కొండయ్య, మోజేసు, సుధాకర్, రాఘవులు, బలిజేపల్లి వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గోచిపాతల వెంకటేశ్వర్లు, చేవూరి మాల్యాద్రి, ఎలికా చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## విపత్తు నష్టాలను నివారించాలి



శిక్షణనిస్తున్న ఉషారాణి

ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాల వలన కలిగే ప్రమాదాలు తదితర విపత్తు నష్టాలను నివారించాలంటే తగిన శిక్షణ అవసరమని కావలి ఆర్.డి.ఓ, రెడ్‌క్రాస్ అధ్యక్షులు యం.లక్ష్మీనరసింహం పేర్కొన్నారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కో-ఆర్డినేటర్ మధుబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సాంకేతిక సహకారంతో ఆర్.డి.ఓ సమావేశ మందిరంలో విపత్తు నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ(సెట్నెల్) సి.ఇ.ఓ డా॥ సి.సుబ్రమణ్యం మాట్లాడుతూ జిల్లాలో 6 శిక్షణాశిబిరాల ద్వారా 250 మందికి శిక్షణనిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ బాద్యులు జి.ప్రసన్నాంజనేయులు, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ డి.సుధీర్‌నాయుడులు ప్రసంగించారు. రెడ్‌క్రాస్ ఉద్యమ పరిస్థితులు, మూల సూత్రాలను కార్యదర్శి డి.రవిప్రకాష్ వివరించారు.

### కాలధర్మం

## పందిళ్ళపల్లి అరుణమ్మ



నెల్లూరుజిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్లపల్లి అరుణమ్మ(65) ఈ నెల 10వ తేదీన కనుమూశారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో 8వ తేదీ ఆమెను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆమె మృతి చెందారు. ప్రస్తుతకాలంలో జిల్లాలో పార్టీలు మార్చకుండా వున్న నిఖార్సయిన నాయకులను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. అలాంటి వారిలో అరుణమ్మ ముందుంటారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ద్వారా చిన్నస్థాయి నుండి పైస్థాయి దాకా నాయకులు పదవులు, ప్రయోజనాలు పొందుంటారు. కాని అరుణమ్మకు కాంగ్రెస్‌పార్టీ చాకిరి తప్ప ప్రయోజనాలు పొందింది లేదు. దాదాపు 25ఏళ్లు ఆమె జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పని చేశారు. రాష్ట్రంలో ఇంకే జిల్లాలోనూ ఇంత సుధీర్ఘ కాలం పని చేసిన వాళ్లుండరు. పార్టీ అధికారంలో వున్నా లేకున్నా ఆమె పార్టీలో వుంటూ, పార్టీ కార్యక్రమాలలో ముందుండి నడిచారు. మహిళలకు సంబంధించి జరిగిన ఉద్యమాలను చురుకుగా నడిపించారు. రాజకీయాలలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరురాలిగా వుంటూ పార్టీ పురోభివృద్ధికి పాటుపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీని అందరూ వదిలి వెళ్లినా అరుణమ్మ మాత్రం కాంగ్రెస్‌ను వీడలేదు. దాదాపు నాలుగుదశాబ్దాల పాటు కాంగ్రెస్‌పార్టీతోనే రాజకీయ నడక మొదలుపెట్టిన ఆమె ఆ పార్టీ నాయకురాలిగానే తనువు చాలించారు. తన అభిమాన నాయకుడైన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వర్ధంతి ఈ నెల 9వ తేదీ కాగా ఆమె పక్కరోజు మృతి చెందారు. ఆమెకు భర్త పట్టాభిరామిరెడ్డి, కొడుకు, కూతురు వున్నారు. పట్టాభిరామిరెడ్డి ఏ.సి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తుండగా, కొడుకు హేమంత్‌రెడ్డి గతంలో యువజన కాంగ్రెస్ నాయకుడిగా చాలాకాలం పనిచేసి ప్రస్తుతం వ్యాపారాలలో స్థిరపడ్డాడు. అరుణమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# విద్య పేరుతో దోపిడి

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులుగా వుంటున్న కామినేని శ్రీనివాస్, పత్తిపాటి పుల్లారావు, గంటా శ్రీనివాసరావులు ఈ ఫలితాలను విడుదల చేశారు. వీరు మంత్రి హోదాలో ఈ ఫలితాలు విడుదల చేశారా లేక "చైనా" ఏజెంట్లుగా విడుదల చేశారా అన్నది ప్రజలు అడుగుతున్న ప్రశ్న? ఇది ప్రశ్నే కాదు, ప్రజల అనుమానం కూడా!

కేవలం విద్యా సంస్థల అధినేతగా వున్న నారాయణ ఒక్కసారిగా మంత్రి మండలిలో చోటు పొందడమేకాకుండా ప్రభుత్వంలో నెం.2గా పిలువబడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రాజధాని' ఏర్పాటు వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తుండడమే విద్యాసంస్థల అధినేతల సంపాదన, వారి ఆదాయం ఎంతటి భారీ పరిమాణంలో వుంటాయో అర్థమై పోతుంది. తమిళనాడులో విద్యాసంస్థలు నడిపే గంటా శ్రీనివాసరావు నారాయణతో వియ్యం అందుకుని తన కుమారుడిని ఈ సంస్థలలో డైరెక్టర్‌గా పెట్టి విద్యా వ్యాపారంలో భాగస్వాముడిగా చేరడం, ఏ సంబంధమూ లేని వర్సిటీ ఎడ్యుకేషనల్ సొసైటీలో పత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాస్‌లు సమన్వయ కమిటి సభ్యులుగా వుండడం అనేక అనుమానాలకు తావివ్వడమే కాకుండా బహిరంగంగా వారు చేస్తున్న అక్రమాలకు అక్షరసాక్ష్యంగా నిలుస్తున్నాయి.

ఫలితాలు విడుదలైన క్షణాల్లోనే ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో సహ టీవీల్లో ప్రకటనలు ఊదరకొట్టేయడమే కాకుండా ఈ ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడడం లేదంటే వారి ఆదాయం ఎంత పెద్ద మొత్తంలో వుంటుందో వేరే చెప్పనవసరం లేదు.

సేవా భావంతో, లాభాపేక్ష లేకుండా పనిచేయడానికే సొసైటీల చట్టం వుంది. మరి వీరు ఏ సేవ చేయడానికి సొసైటీలు ఏర్పాటు చేస్తున్నారో... ఎవ్వరికీ తెలియదు. రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీకి లెక్కలు చెప్పరు. సొసైటీల పేరుతో ఆస్తులు తక్కువ ఖర్చుకి కొంటారు. వాటిని ఎక్కువ లాభాలకు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మి ఆ సొమ్ముని వాళ్ళ తమ సొంత ఖాతాల్లోకి జమ చేసుకుంటారు.

రియల్ మాఫియా, ఇసుక మాఫియా, మద్యం మాఫియాలను మించిన స్థాయిలో రాష్ట్రంలో విద్యా మాఫియా తయారయ్యింది. కేశవరెడ్డి విద్యాసంస్థల బాధితులు 11వేల మందిని బజారుపాలు చేసి ప్రభుత్వం ఆ సంస్థలను శ్రీచైతన్యకు అప్పజెప్పింది. కేవలం ఫీజులు వసూలు చేయడం, జీతాలు చెల్లించడం వరకే మా బాధ్యత అంటూ శ్రీచైతన్య యాజమాన్యం కేశవరెడ్డి బాధితులకు మొండి చెయ్యి చూపిస్తోంది.

అమాయకులైన విద్యార్థులను వారి తల్లిదండ్రులను దగా చేస్తూ తమ పబ్బం గడుపుకుంటూ యేడాదికి 5000కోట్ల రూపాయల దోపిడీని చేస్తున్న సంస్థలపై సమరశంఖం పూరించడానికి నెల్లూరులో "నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి" ఆవిర్భవించింది. విద్యా ముసుగులో వీరు చేస్తున్న దోపిడీకి దుర్మార్గాలకీ స్వస్తి పలికించడమే ధ్యేయంగా ఈ సంస్థ కృషి చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా సభ్యులను ఏర్పాటు చేసుకుని పోరాటం దిశగా ముందుకు వెళ్ళి అవసరమైతే ఢిల్లీ స్థాయిలో కోర్టులను ఆశ్రయించి విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చూడాలని నడుం బిగించింది.

అధికార అండతో ధన బలంతో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థని తమ గుప్పిట్లోకి తీసుకుని చక్రం తిప్పాలని ప్రయత్నిస్తున్న పలుకుబడిగల పెద్దల భాగోతాన్ని బయటపెట్టే క్రమంలో చైతన్యవంతమైన వ్యక్తులను ఉత్సాహవంతమైన యువశక్తిని యువ సంఘాలని ఈ పోరాటంలో భాగస్వాములు కావలసిందిగా ఆహ్వానిస్తోంది.

'షేర్ విద్య' నినాదంతో విద్యను పంచి పెట్టడమే ధ్యేయంగా, 'సేవ్ విద్య' అంటూ విద్యను కాపాడడమే లక్ష్యంగా, 'సేల్ విద్య' అంటూ విద్యను అమ్ముకుంటున్న వారిని, వారి కొమ్ముకాస్తున్న వారిని నిలదీసే దిశగా అడుగులు వేస్తున్న "నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి"కి అందరూ అండగా నిలవాలని ఆహ్వానిస్తూ, చేయి చేయి కలిపి స్వచ్ఛమైన విద్యని సాధిద్దాం అంటున్నారు "నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి" సభ్యులు.

# సంస్కృతి సమ్మేళనం

(8వ పేజీ తరువాయి)

సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రముఖ కవులను, పండితులను, పరిశోధులను ఆహ్వానించి, వారిచేత సాహిత్యోపన్యాసాలు ఇప్పించి తద్వారా సాహితీరంగాన్ని మరింత ప్రతిభావంతం చేస్తోంది. అంతేగాక, సంగీత నృత్యపాఠశాలను నిర్వహిస్తూ ఇప్పటిదాకా వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులకు నాట్యంలోనూ శిక్షణ ఇప్పించి నాట్యరంగానికి కూడా తనవంతు సేవలందిస్తోంది. ఇలా బహుముఖ సేవలందిస్తోన్న ఈ సంస్థకు వదాన్యులు, ఈ సంస్థ అధ్యక్షులు సిద్దారెడ్డి జనార్ధారెడ్డి 20 లక్షల రూపాయలను భూరివిరాళంగా అందించగా, మిత్రుల ద్వారా మరో 10 లక్షల రూపాయలను సేకరించి, దాని ద్వారా వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నాటికల పోటీలు, సాహితీ సదస్సులు, సంగీత నృత్య పాఠశాల, పౌరాణిక నాటక ప్రదర్శనలు, హాస్యవల్లరి వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వుంది. ఈ ఏడాది కూడా గూడూరు సంస్కృతి సమ్మేళనం వారు మే నెల 5,6,7,8 తేదీల్లో నిర్వహించిన నాటికల పోటీల్లోనూ అద్భుతమైన, సందేశాత్మకమైన, స్పందనాత్మకమైన నాటికలు ప్రదర్శనకు వచ్చాయి. దాదాపు అన్ని నాటికలు ప్రజా చైతన్యమే పరమావధిగా రచించినవే కావడం విశేషం.

## ఉత్తమ ప్రదర్శన... 'పితృ దేవోభవ'!..



ఈ ఏడు ప్రదర్శించిన నాటికల్లో ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది.. 'పితృ దేవో భవ' అనే నాటిక. కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్, గుడివాడ కళాకారులు ఈ నాటికను అత్యంత హృద్యంగా ప్రదర్శించి ప్రథమ బహుమతిని అందుకున్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లల బాధ్యతను విడమరిచి వివరించే ఈ నాటిక ప్రేక్షకులకు కంటనీరు తెప్పించిందంటే అతిశయోక్తి కాదు. ఉత్తమ ప్రదర్శనతో పాటు, ఉత్తమ నటుడుగా ఈ నాటికలో నటించిన శ్రీరం శ్రీనివాసరావు తన నటనాప్రతిభతో అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఇందులో తండ్రిపాత్రకు తగ్గ తనయునిగా 'రాఘవ' పాత్రను ఆయన అత్యద్భుతంగా పోషించారు. ఈ నాటిక ఇంకా అనేక బహుమతులను కూడా అందుకుంది. అదేవిధంగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా బహుమతి పొందిన సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి నాటిక 'లైఫ్‌లైన్' భారతీయ వివాహ వ్యవస్థలో వున్న ఔన్నత్యాన్ని, ఆధునిక కాలంలో ఆ వివాహ వ్యవస్థ స్వల్పమైన కారణాలతో ఎలా ఛిద్రమవుతుందో అర్థవంతంగా వివరిస్తుంది. ఇందులో నటించిన కథానాయిక పాత్రధారి శ్రీమతి సురభి ప్రభావతి తన అద్భుత నటనాప్రతిభతో ఉత్తమ నటి అవార్డును సాధించింది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా బహుమతి సాధించిన 'తలుపు చప్పుడు' నాటికను నెల్లూరుకు చెందిన 'ప్రియదర్శిని' నాటక సంస్థవారు ప్రదర్శించారు.

చిన్నపిల్లలపై లైంగిక దాడుల నేపథ్యంలో సాగిన ఈ రచన అనేకానేక మలుపులతో ఆద్యంతం ఉత్కంఠగా, రసవద్భరితంగా సాగి అందరి కరతాళధ్వనులందుకుంది. పిల్లలను మంచివారిగా, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి పిల్లలకు శిక్షణ ఎంతగా అవసరమో, అదేవిధంగా అలాంటి మంచి బిడ్డలను సమాజానికి అందించడానికి తల్లిదండ్రులకు కూడా మంచి క్రమశిక్షణ కలిగిన శిక్షణ అవసరమని ఆ నాటిక స్పష్టం చేస్తుంది. బిడ్డలు మంచివారుగా ఎదగాలంటే అందుకు పూర్తిబాధ్యత తల్లిదండ్రులదేనని నొక్కి చెప్పే ఈ నాటిక అందరి ప్రశంసలూ అందుకుంది. అద్భుతమైన రచనా సంవిధానంతో, నాటకీయంగానే కాక రసవత్తరమైన మలుపులతో ఈ నాటిక రచన సాగింది. ఈ నాటికలో తండ్రి పాత్రధారిగా బి.నిరంజన్ అమోఘమైన నటనా చాతుర్యంతో ఉత్తమ నటునిగా బహుమతిని సాధించుకున్నాడు. గౌతమ్‌గా నటించిన టి.సుధాకర్‌కు ఉత్తమ విలన్‌గా బహుమతి లభించింది. ఇకపోతే, స్పెషల్ జ్యూరీ అవార్డు పొందిన కెజిఆర్ కల్చరల్ అసోసియేషన్-సికింద్రాబాద్ వారి నాటిక 'ఎవరిని ఎవరు క్షమించాలి?'.. మత సామరస్యానికి ప్రతీకగా నిలచి అందరి ప్రశంసలు అందుకుంది. చక్కని కథా సందేశంతో, సూటిగా గుండెల్ని కదిలించే సంభాషణా సంవిధానంతో ఈ నాటిక బహుమతిని అందుకుంది. ప్రత్యేక ప్రదర్శనలుగా ప్రదర్శించబడిన 'అమ్మ' నాటిక అందరినీ ఆకట్టుకోగా, పుట్టపర్తి సాయిబాబా దివ్యత్వాన్ని, అమ్మలోని అమృతత్వాన్ని ఆవిష్కరించింది. శాలివాహన కళామందిర్-చెన్నూరు వారి 'చిటారుకొమ్మన మిఠాయిపొట్లం' నాటిక కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ నాటికోత్సవాల్లో ఈసారి ప్రత్యేకత ఏమంటే, హాస్య నాటికలు ఎక్కువగా రావడం. హాస్యనాటికలు ఎంతో హాస్యరసభరితంగా వుండి, అందరినీ కడుపుబ్బ నవ్వించాయి. 'అంతా మన సంచికే'.. అన్న హాస్య నాటికలో నటించిన రంగడు పాత్రధారి వరికూటి శివప్రసాద్ ఉత్తమ హాస్యనటునిగా, ఉత్తమ హాస్యనటీమణిగా జయలక్ష్మి ఉత్తమమైన నటనను ప్రదర్శించి బహుమతులు అందుకున్నారు. బాలనటిగా 'లైఫ్‌లైన్'లో నటించిన బేబి నిఖిత బహుమతి సాధించింది.

కాగా, ఈ పోటీలు నిర్వహించిన గూడూరు సంస్కృతి సమ్మేళనం నిర్వాహకులతో పాటు, వారికి సహకరించిన దాతలు, కళాకారులు, కళాభిమానులు, ముఖ్యంగా జానా శివయ్య, దువ్వూరు జనార్ధన్, అద్దంకి సుబ్రహ్మణ్యం, తిరుమలశెట్టి శ్రీనివాస్, మునిగిరీష్, కట్టా మురళీకృష్ణ తదితరులందరూ ఈ పోటీల నిర్వహణలో సహకరించి కళారంగంలో గూడూరు ఖ్యాతి ఇనుమడింపజేసేలా కృషి చేసి, కళాకారులు.. ప్రజలందరి అభిమానానికి పాత్రులైనారు.

- సమీక్ష: డా. గంగిశెట్టి శివకుమార్

# ఉంటాడా? వెళ్తాడా??



ఆపరేషన్ ఆకర్ష్‌కు నెల్లూరుజిల్లాలో ఇంతవరకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాత్రమే తగులుకోవడం తెలిసిందే! నెల్లూరుజిల్లా నుండి కనీసం ముగ్గురు ఎమ్మెల్యేలనన్నా లాగాలని తెలుగుదేశం నేతల ప్రయత్నం. వైకాపా ఎమ్మెల్యేలు జగన్ వెంట బలంగా నిలబడి వుండేది ఈ జిల్లాలోనే! ఏడు మందిలో ఒకరు మాత్రమే వెళ్లారు. మరో ఇద్దరిని తీసుకెళ్లాలని బలంగా ప్రయత్నిస్తున్నారు. ఈ పరంపరలోనే కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పేరు తెరమీదకొచ్చింది.

కుక్కను చంపాలంటే ముందుగా అది పిచ్చికుక్క అని ముద్రవేయాలి. వైకాపా ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు విషయంలో తెలుగుదేశం అనుకూల మీడియా కూడా ఇలాగే వ్యవహరిస్తోంది. ఫలానా వాళ్లు తెలుగుదేశంలో చేరొచ్చని వీళ్లే రాస్తారు. అప్పటికి ఆ ఎమ్మెల్యేకు ఆలోచన కూడా వుండదు. ఆ తర్వాత పార్టీ మారే తేదీలను కూడా వీళ్లే ఖరారు చేస్తారు. పబ్లిక్‌లో ఇంత చర్చ, ఇంత రచ్చ జరిగాక ఆటోమేటిక్‌గా ఆ ఎమ్మెల్యేలలోనూ పార్టీ మారాలనే ఆలోచన వస్తుంది.

ఇప్పుడు రామిరెడ్డి ప్రతాప్ విషయంలో ఆ ప్రయత్నం సఫలమవుతుందా? లేక విఫలమవుతుందా అన్నది చూడాలి. రామిరెడ్డి ప్రతాప్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసారని, మంత్రి నారాయణతోనూ మూడుసార్లు మాట్లాడాడని, బీద సోదరులు కూడా అభ్యంతరం తెలపలేదని తెలుగుదేశం అనుకూల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నెల 18న పార్టీలో చేరుతున్నట్లు ముహూర్తం పెట్టేశారు. రామిరెడ్డికి రెండువందల కోట్ల కాంట్రాక్ట్ పని ఇచ్చేటట్లు, అలాగే రాజధాని ప్రాంతంలో ఆయన భూములకు ఇబ్బంది కలుగకుండా కొత్త హైవే అలైన్‌మెంటు మార్చేటట్లు ఒప్పందం కుదిరిందని కూడా వూహాగానాలు వెలువడ్డాయి.

అయితే ఈ వూహాగానాలకు రామిరెడ్డి ప్రతాప్ ఒక్కసారిగా తెరదించారు. ఒకసారి ఎమ్మెల్సీ, ఒకసారి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చిన జగన్‌ను వదిలిపోయే ప్రసక్తేలేదని, తెలుగుదేశం పార్టీ వాళ్ళు తమ పార్టీలో చేరమని ఫోన్లు చేసి విసిగిస్తున్నారని, నేను పార్టీ మారనని చెప్పడానికే తాను మంత్రి నారాయణను నేరుగా కలవడం జరిగిందని చెప్పారు.

అయితే ఇంతవరకు వైకాపాను వీడిన ఎమ్మెల్యేల సంగతి చూస్తే పార్టీ మారే రెండ్రోజులు ముందు చంద్రబాబును, ప్రభుత్వాన్ని విమర్శించిన వాళ్లే! ఆరు నూరైనా జగన్ వెంటే ఉంటామని చెప్పిన వాళ్లే! ప్రతాప్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తాడా? లేక చెక్ పెడతాడా? అన్నది చూడాలి.

# విడిపోవడానికి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ వాళ్లు పంచుకోవచ్చు. ప్రత్యేకహోదా కోసం చంద్రబాబు ఏనాడూ గట్టిగా అడిగింది లేదు. కాబట్టి కేంద్రం కూడా దీని గురించి సీరియస్‌గా తీసుకోలేదు. అదీగాక రాష్ట్రంలో తెలుగుదేశంకు దూరం కావాలనే ప్రయత్నాలలో బీజేపీ వుంది. ఏపిలో టీడీపీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ అధిష్టానం ఆలోచన. కేంద్రం ఇచ్చే నిధులన్నింటికి చంద్రబాబు తన పేర్లు పెట్టుకుంటున్నాడు. రేపు ప్రత్యేకహోదా ఇచ్చినా ఇది నా ఘనతేనని చంద్రబాబు చెప్పుకుంటాడు. మిత్రపక్షంగా వుంటే బీజేపీ దానికి అడ్డు చెప్పలేదు. కాబట్టి తెలుగుదేశం నుండి వీలైనంత తొందరగా విడిపోయే ప్రయత్నాల్లో బీజేపీ వుంది. వైకాపా ఎమ్మెల్యేలు చాలా మంది తెలుగుదేశంలో చేరుతున్నారు. వైకాపా బలహీన పడితే ఆ పార్టీకి రాష్ట్రంలో రాజకీయ, ఆర్థిక అండదండలు అవసరం. అవి బీజేపీ వద్ద ఉన్నాయి. వైకాపాతో పొత్తు పెట్టుకోవడమో, లేక ఆ పార్టీని విలీనం చేసుకోవడమో జరగొచ్చు. తెలుగుదేశంతో కలిసి వుంటే ఈ రాష్ట్రంలో బీజేపీ మరుగుజ్జుగానే వుంటుంది. వైసిపి బలహీనపడ్డాక ఆ పార్టీతో కలిస్తే బీజేపీ కూడా బలంగానే కనిపిస్తుంది. తెలుగుదేశం నుండి విడిపోయాక రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు మరిన్ని పథకాలను కేంద్రప్రభుత్వం ద్వారా ప్రకటింపచేస్తే ఆటోమేటిక్‌గా ఈ రాష్ట్రంలో బీజేపీ బలపడుతుంది. ఈ వ్యూహంతోనే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై బీజేపీ ముందుకు పోతున్నట్లుగా తెలుస్తోంది.


శుభాకాంక్షలు



నెల్లూరులోని హోటల్ అనురాగ్‌లో ఏర్పాటు చేసిన
ఫోటో ఆల్బమ్ ఎగ్జిబిషన్, ఎంబోసింగ్ ప్రింట్స్‌లో పాల్గొని
విజయవంతం చేసిన అందరికి మా శుభాకాంక్షలు.

DINA COLOUR LAB - Chennai

# 2016 - SSC ఫలితాలలో నవ్యాంధ్రరాష్ట్రంలో మెరిసిన రత్నాలు

# సంధించిన బాణంలా.. గురి తప్పని విజయాలు

## అత్యధిక గ్రేడ్ పాయింట్లు సొంతం చేసుకొని విద్యారంగంలో నింగినంటిన "రత్నం"



K.V. RATNAM

"శీలేన శోభతే విద్య"

### నెల్లూరు జిల్లాలోని మా స్కూల్స్ ఆణిముత్యాలు



10 పాయింట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీ కె.వి. రత్నం గారు

GPA 10/10

| | |
|---|---|
| M. VYSHNAVI | H.T.No. 1617114030 |
| SK. N. TASNEEM | H.T.No. 1617113914 |
| P. JAHNAVI | H.T.No. 1617113921 |
| P. MOUNIKA | H.T.No. 1617113746 |
| T. BHARGAV RAM | H.T.No. 1617114062 |
| K. SIVA KUMAR | H.T.No. 1617113916 |
| R. NIKITHA | H.T.No. 1617114068 |
| T. R. PRASAD | H.T.No. 1617114063 |
| N. YASWITHA | H.T.No. 1617107807 |
| V. KAVYA | H.T.No. 1617108729 |
| G. ROHITH KUMAR | H.T.No. 1617109204 |
| Y. P. KUMAR REDDY | H.T.No. 1617107373 |
| S. UMA BHANU | H.T.No. 1617109142 |
| K. MOHAN KRISHNA | H.T.No. 1617110507 |
| B. LASYA | H.T.No. 1617104265 |
| P. SARAN | H.T.No. 1617103108 |
| S.V.L. DIVYA | H.T.No. 1617103582 |
| M.SREE MOUNA | H.T.No. 1617103518 |
| K. YASHASWINI | H.T.No. 1617102462 |
| P. KARTHIK | H.T.No. 1617103990 |
| T.V. SAI SUPRITH | H.T.No. 1617103286 |
| K. L. POOJITHA | H.T.No. 1617103852 |
| K. THRUSHWANTH | H.T.No. 1617103564 |
| P. SAI RITHVIKA | H.T.No. 1617104622 |
| M. LAHARI PRIYA | H.T.No. 1617117010 |
| M. BHAVANA SRUTHI | H.T.No. 1617118219 |
| D. BHARGAVI | H.T.No. 1617109149 |
| S. THALPA SAI | H.T.No. 1617108764 |
| POOJITHA | H.T.No. 1617108411 |
| SUNEEL KUMAR | H.T.No. 1617108862 |
| P. KAVYA SREE | H.T.No. 1617105664 |
| L. KUNDAN SAI | H.T.No. 1617105966 |
| M. RAJESWARI | H.T.No. 1617106088 |
| D. SAI MANAS | H.T.No. 1617106348 |
| R. VINEETHA | H.T.No. 1617107870 |
| K. KAVERI | H.T.No. 1617105503 |

### గ్రేడ్ పాయింట్ల వారీగా విశ్లేషణ

| | | | |
|---|---|---|---|
| 10 GPA సాధించినవారు | 36 | 9.3 GPA సాధించినవారు | 408 |
| 9.8 GPA సాధించినవారు | 118 | 9.2 GPA సాధించినవారు | 527 |
| 9.7 GPA సాధించినవారు | 214 | 9.0 GPA సాధించినవారు | 619 |
| 9.5 GPA సాధించినవారు | 319 | | |

10/10 GPA సాధించిన మా తిరుపతి స్కూల్ విద్యార్థులు 9 మంది

### అడ్మిషన్లకొరకు సంప్రదించండి

Ratnam Residential High School
RACE School (Day & Residential)
Pidathapolur, Nellore
Cell: 94409 35209, 92480 48090, 95504 43399

Ratnam School
Dhanalakshmipuram, Nellore
Cell : 91000 20999

ఈ విజయాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు, మరియు తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, సిబ్బందికి కృతజ్ఞతలు..

## RATNAM HIGH SCHOOLS

| | | | | | |
|---|---|---|---|---|---|
| HARANATHAPURAM | : 98669 65577 | BUCHI | : 77023 33325 | THINK NEXT(RITWIK) | : 99488 35483 |
| (DAY & RESIDENTIAL) | : 87900 42323 | KOVURU | : 77020 00070 | KRISHNA DEVARAYA | : 99089 90526 |
| LAKSHMIPURAM | : 77020 00050 | SARASWATHI NAGAR | : 92464 33550 | VEDAYAPALEM | : 89859 66620 |
| PEDDABAZAR | : 77020 00060 | DARGAMITTA | : 92464 33681 | NICE FOUNDATION | : 94407 56641 |
| A.C.NAGAR | : 77020 00054 | Dr. CV RAMAN SCHOOL | : 96429 15414 | KAVALI | : 99515 00660 |
| GUDUR | : 77020 00063 | FUTURE VISION | : 94948 73386 | ATMAKUR | : 70327 06345 |

RATNAM HIGH SCHOOL

# రత్నం స్కూల్స్ నెల్లూరు

డే & రెసిడెన్షియల్ స్కూల్స్


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com